

మంత్రి అయిన తరువాత తొలిసారి జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన వంగలపూడి అనితను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

జిల్లా రెవెన్యూ అధికారిగా సత్యనారాయణ

అన్నమయ్య జిల్లా నుంచి రాక

- జీఏడీలో రిపోర్ట్ చేయాలని ప్రస్తుత డీఆర్‌వో దయానిధికి ఆదేశాలు


వైఎస్‌వీకేజీఎల్ సత్యనారాయణ

అనకాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా వైఎస్‌వీకేజీఎల్ సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం అన్నమయ్య డీఆర్‌ఓగా పని చేస్తున్న ఇతనిని ప్రభుత్వం అనకాపల్లి జిల్లాకు బదిలీ చేసింది. కాగా ప్రస్తుతం అనకాపల్లి డీఆర్‌ఓగా వున్న బలివాడ దయానిధికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జిల్లా విద్యా శాఖాధికారిగా అప్పారావు నాయుడు

- అల్లూరి జిల్లా నుంచి రాక
- వెంకట లక్ష్మమ్మ ఏలూరు జిల్లాకు బదిలీ


గిడ్డి అప్పారావు నాయుడు

అనకాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖాధికారిగా గిడ్డి అప్పారావు నాయుడు నియమితులయ్యారు. ఏఎస్ఆర్ జిల్లా విద్యా శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఇతనిని అనకాపల్లికి బదిలీ చేస్తూ, డీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అనకాపల్లి డీఈఓగా వున్న ఎం.వెంకట లక్ష్మమ్మను ఏలూరు జిల్లా విద్యా శాఖాధికారిగా బదిలీ చేశారు.

జల్ జీవన్ మిషన్ పనుల్లో జాప్యం

కొన్నిచోట్ల నాసిరకంగా ఉండి.. పగిలిపోతున్న పైపులైన్లు

- జడ్పీ సమావేశంలో సభ్యులతోపాటు హోం మంత్రి అనిత ఆరోపణ
- జల వనరుల శాఖ స్థలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ పనులు.. ఈఈపై ఆగ్రహం
- రోడ్ల పక్కన తుప్పలతో ప్రమాదాలు
- తొలగించాలని ఆర్అండ్‌బీ ఇంజనీర్లకు మంత్రి ఆదేశాలు
- సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చునని వెల్లడి


జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత. వేదికపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, విశాఖ, అల్లూరి జిల్లాల కలెక్టర్లు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల్లో జాప్యం జరుగుతున్నదని, కొన్నిచోట్ల పనులు నాసిరకంగా ఉన్నాయని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. జల్ జీవన్ మిషన్ పనులపై చర్చలో పాల్గొన్న పరవాడ, నర్సీపట్నం, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు పైలా సన్యాసిరాజు, సుకల రమణమ్మ, దీసరి గంగరాజులు మాట్లాడుతూ, పలుచోట్ల నీటిసరఫరా పైపులు పగిలిపోతున్నాయని అన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల్లో జాప్యం జరుగుతున్నదని, నాణ్యత లేదన్న విషయం కూడా తన దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో ఎన్ని నీటి ట్యాంకులు శుభ్రం చేశారని గ్రామీణ నీటి సరఫరా విభాగం అనకాపల్లి ఈఈ బాలాస్వామిని ఆమె ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి బదులిస్తూ... మొత్తం 1,730 ట్యాంకులకుగాను ఇప్పటి వరకు 970 ట్యాంకులు శుభ్రం చేశామని, మిగిలిన వాటిని త్వరలో శుభ్రం చేయిస్తామని చెప్పారు.

నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ పనులు ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయడంతోపాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలన్నారు. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు మాట్లాడుతూ, పరవాడ మండలం తాణాంలో జలవనరుల శాఖ కాలువను కుదించి గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులు చేపడుతున్నదని ఆరోపించారు. దీంతో హోం మంత్రి జోక్యం చేసుకుని... జలవనరుల శాఖ అనుమతులు లేకుండా కాలువ ఎలా నిర్మిస్తారని, ఇందుకు బాధ్యులను చేస్తూ ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ గ్రామీణ నీటి సరఫరా విభాగం అనకాపల్లి ఈఈ బాలాస్వామిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలవనరుల శాఖ పరిధిలోని కాలువల్లో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కోటవురట్ల, ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యులు ఉమాదేవి, కాకర దేవి మాట్లాడుతూ, రోడ్లకు ఇరువైపులా విపరీతంగా పెరిగిపోయిన తుప్పల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, వీటిని తొలగించాలని కోరారు. మంత్రి అనిత స్పందిస్తూ.. ఉమ్మడి జిల్లాలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలు తొలగించాలని ఆర్అండ్‌బీ ఇంజనీర్లను ఆదేశించారు. చెరువులు, కాలువల గట్లు పటిష్ఠం చేయాలని జలవనరుల శాఖ ఈఈ త్రినాథ్‌ను ఆదేశించారు. ఇసుక సరఫరాపై కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి మాట్లాడుతూ, ఇసుక ఉచితమేనని, అయితే సొంత అవసరాలకు మాత్రమే తీసుకెళ్లాలని, రవాణా సమయంలో వివరాలను పోర్టల్‌లో నమోదుచేస్తే సరిపోతుందన్నారు. ఇసుక రవాణాకు పోలీసుల నుంచి ఇబ్బందులు ఉండవన్నారు.


జడ్పీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు


మాట్లాడుతున్న రమణమ్మ (నర్సీపట్నం), కర్రి సత్యం (దేవరాపల్లి), పైలా సన్యాసిరాజు (పరవాడ)

మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ, మునగపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గడువు తీరిన చెక్కీలు ఇచ్చారని, మధ్యాహ్నభోజనం పథకంలో లోపాలు ఉన్నాయని, పాఠశాలలో పిల్లలతో పనులు చేయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనం పథకంలో వంట ఏజెన్సీలు కందిపప్పు, ఇతర వస్తువులను కొంత మేర దారి మళ్లిస్తున్నారని చెప్పగా.. చర్యలు తీసుకుంటామని డీఈవో వెంకటరమణమ్మ తెలిపారు. ఇటీవల అనకాపల్లి బీసీ హాస్టల్‌లో విద్యార్థులను అక్కడ కుక్ కొట్టారని, ఇంకా పలు రకాలుగా వేధిస్తున్నారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రమణమ్మ కోరారు.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల చేపట్టిన ఈవోఆర్డీ బదిలీల్లో ఏజెన్సీకి అన్యాయం చేశారని జడ్పీ చైర్‌పర్సన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఏజెన్సీ నుంచి ఎంత మందిని మైదానానికి బదిలీచేస్తే అంత మందిని ఏజెన్సీకి పంపలేదన్నారు. అనకాపల్లి డీపీవో శిరీషారాణి బదులిస్తూ.. ఇక్కడ నుంచి బదిలీ అయిన వారిని ఏజెన్సీకి పంపిస్తామన్నారు.

భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, ఇటీవల పద్మనాభం మండలం మద్దిలో ప్రైవేటు పాఠశాల బస్సు రెండు పర్యాయాలు ప్రమాదానికి గురైందని చెప్పగా, డీఈవో చంద్రకళ జోక్యం చేసుకుని పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ ఇచ్చామన్నారు. ఈ సమయంలో విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ, ఏటా జూన్, జూలై నెలల్లో విద్యా సంస్థల బస్సులు తనిఖీ వుంటుందని, అయినా మరోసారి రవాణా శాఖకు ఆదేశాలు ఇస్తామన్నారు.

బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ, ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడంలేదని ఫిర్యాదు చేయగా, చైర్‌పర్సన్ బదులిస్తూ.. ప్రతి శాఖ పరిధిలో నిర్వహించే కార్యక్రమాలకు విధిగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో మునగపాక, దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యులు సత్యనారాయణ, సత్యం... రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల లభ్యత ... మిగతా 8వ పేజీలో

రోడ్డెక్కిన బీసీ విద్యార్థినులు

కళాశాల హాస్టల్‌లో సమస్యలపై ఆందోళన

- రహదారిపై బైఠాయించి నిరసన
- భోజనం, వసతులు అధ్వానంగా ఉన్నాయని ఆవేదన
- సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణ
- గంటకుపైగా ట్రాఫిక్‌కు అంతరాయం
- సీఐ, తహసీల్దారు హామీతో ఆందోళన విరమణ


ప్రధాన రహదారిపై వంట సామగ్రి ఉంచి నిరసన తెలుపుతున్న బాలికలు

ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని బీసీ కళాశాల వసతిగృహం విద్యార్థినులు గురువాం ఇక్కడ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో సుమారు గంటకుపైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తొలుత ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులంతా హాస్టల్ నుంచి నినాదాలు చేసుకుంటూ బీసీ వెల్ఫేర్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వసతిగృహంలో మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, నాణ్యత ఉండడం లేదని, సిబ్బంది పనితీరు బాగోలేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వసతిగృహంలో నెలకొన్న సమస్యలను పలుమార్లు బీసీ వెల్ఫేర్ అధికారి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించారు. వంట సామగ్రిని రోడ్డుపై ఉంచి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వసతిగృహంలో పెడుతున్న భోజనంలో పురుగులు ఉంటున్నాయని, భోజనం నాణ్యతగా ఉండడం లేదని, కొంతమంది సిబ్బంది విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ, డివిజన్ కార్యదర్శి మణికంఠ, అధ్యక్షుడు కేశవ్‌లు మాట్లాడుతూ, వసతిగృహంలో 100 మంది విద్యార్థినులు వున్నారని, వీరికి వాష్‌రూమ్‌లు ఐదు మాత్రమే వున్నాయని, ఇవి ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. వసతిగృహంలో సమస్యలను ... మిగతా 8వ పేజీలో


బీసీ వెల్ఫేర్ అధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

భారీ వాహనాలతో బేజారు!

అనకాపల్లి రోడ్లపై రేయింబవళ్లు రాకపోకలు

- ప్రమాదకరంగా క్వారీ లారీలు, టిప్పర్ల ప్రయాణం
- పట్టణంలో తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఛిద్రమవుతున్న రహదారులు
- పట్టించుకోని పోలీసు, రవాణా శాఖల అధికారులు


క్వారీ బండరాళ్లతో అనకాపల్లి పట్టణంలో నుంచి వెళుతున్న భారీ టిప్పర్ లారీలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

భారీ వాహనాలు పట్టపగలే జిల్లా కేంద్రంలోని రోడ్లపై ప్రమాదకరంగా దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా అధిక లోడుతో క్వారీ లారీలు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసు, రవాణా శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండడం విమర్శలకు దారి తీస్తున్నది.


సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్ లారీ (ఫైల్ ఫొటో)

జిల్లాలో ఎక్కడా లేనన్ని రోడ్డు మెటల్, కంకర క్వారీలు, స్టోన్ క్రషర్లు అనకాపల్లి మండలంలో ఉన్నాయి. నిత్యం రోడ్డు మెటల్, కాంక్రీట్‌కు వినియోగించే పిక్క ఇక్కడ నుంచి పలు ప్రాంతాలకు రవాణా అవుతుంది. రాంబిల్లి మండలంలో ఏర్పాటవుతున్న ప్రత్యామ్నాయ నేవల్ బేస్‌లో సముద్ర తీరంలో జెట్టీ నిర్మాణం, అలలకు అడ్డుకట్ట వేసే పనుల కోసం పెద్ద పెద్ద బండరాళ్లను మామిడిపాలెం, మార్టూరు, బవులువాడల్లోని క్వారీల నుంచి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం భారీ వాహనాలు, క్వారీ లారీలు, టిప్పర్లు వంటి రవాణా వాహనాలు పగటిపూట పట్టణంలో నుంచి ప్రయాణించడానికి వీల్లేదు. రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటల వరకు మాత్రమే భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించాలి. కానీ భారీ వాహనదారులు అనకాపల్లిలో ఈ నిబంధనలను పాటించడం లేదు. పోలీసులు సైతం పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణంలోని పలు రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. భారీ వాహనాల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారు.

అనకాపల్లి మండలంలోని మార్టూరు, మామిడిపాలెం, హెచ్ఎస్ఆర్ అగ్రహారం, కుంచంగి, కూండ్రం, రొంగలివానిపాలెం, నర్సింగరావుపేటల్లో కంకర, రోడ్డు మెటల్ క్వారీలు, క్రషర్లు ఉన్నాయి. నిత్యం రైల్వే అండర్ బ్రిడ్జి, నెహ్రూచౌక్ మీదుగా పదుల సంఖ్యలో క్వారీ లారీలు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో నెహ్రూ చౌక్, పరిసరాల్లో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. రాయి, పిక్క, క్రషర్ బుగ్గి రవాణా చేసే లారీలు, టిప్పర్ల కారణంగా దుమ్ము, ధూళి విపరీతంగా ఎగిసిపడుతున్నది. దీంతో ఈ వాహనాల వెనుక ప్రయాణించే వారితో పాటు ఎదురుగా వచ్చే వాహనాల్లోని వారు ... మిగతా 8వ పేజీలో

డ్రోన్‌తో మందుల పిచికారీ

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు వినియోగం

- ఫలించిన శాస్త్రవేత్తలు పరిశోధనలు
- చెరకు తోటల్లో ప్రయోగం కూడా ఆశాజనకం


అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో మొక్కజొన్న పైరుపై జీవ నియంత్రణ మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

అనకాపల్లి అగ్రికల్చర్ 24 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు డ్రోన్‌లతో జీవన నియంత్రణ మందులను పిచికారీ చేసే పద్ధతులపై అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ చేపట్టిన పరిశోధనలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఉత్తర కోస్తా జిల్లాల్లో ముఖ్య పంటలైన చెరకు, మొక్కజొన్నలను ఆశించిన తెగుళ్ల నివారణకు డ్రోన్‌లతో మందులను పిచికారీ చేసే పద్ధతులపై శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జి.కుసుమ, ఏడీఆర్ పీవీచ్ ముకుందరావుల బృందం విస్తృత పరిశోధనలు జరుపుతున్నది. వీటి వివరాలను డాక్టర్ జగన్నాథరావు గురువారం మీడియాకు తెలియజేశారు. మొక్కజొన్నను ఆశించే కత్తెర పురుగు నివారణకు జీవ నియంత్రణ మందు మెటరైజియంను డ్రోన్ ద్వారా 1.1 మీటర్ల ఎత్తులో సెకనుకు నాలుగు మీటర్ల వేగంతో పైరుపై పిచికారీ చేయడం ద్వారా పురుగును సమర్థంగా నివారించవచ్చని తమ పరిశోధనలో తేలిందని తెలిపారు. పవర్ స్ప్రేయర్ పిచికారీతో పోల్చితే డ్రోన్ పద్ధతిలో పిచికారీ మంచి ఫలితాలను ఇస్తున్నదన్నారు. వివిధ ఎత్తులు, పలు రకాల వేగాలతో పురుగు మందులను పిచికారీ చేసి, ఫలితాలను అధ్యయనం చేసే ప్రయోగాలు కొనసాగుతున్నాయన్నారు.


మొక్కజొన్నను ఆశించిన కత్తెర పురుగు (ఫైల్ ఫొటో)

చెరకు తోటలపై..

చెరకు తోటలను ఆశించే పీక పురుగు, పసుపు ఆకు తెగులు నివారణకు పురుగు మందులను, ద్రవరూపక పోషకాలను డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేసే ప్రయోగాలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. డ్రోన్‌లను ఉపయోగించి పురుగు మందులను పిచికారీ చేయడం, మామూలు పిచికారీ పద్ధతుల కంటే పూర్తి సురక్షితమైనదని ఆయన అన్నారు. డ్రోన్‌తో ఎకరా విస్తీర్ణంలో ఐదు నుంచి ఆరు నిమిషాల్లో మందులను పిచికారీ చేయవచ్చని, అదే పవర్ స్ప్రేయర్ అయితే రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుందని జగన్నాథరావు తెలిపారు.

భూ సమస్యలపై అర్జీల వెల్లువ

కశింకోట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే అనంతరం తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు చక్కగా దోహదపడతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు అన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో గురువారం నిర్వహించిన సభలో మాట్లాడారు. ఇటువంటి సభలను అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.ఈ సందర్భంగా భూముల మ్యూటేషన్ తదితర వాటిపై 59మంది అర్జీలు సమర్పించారు. మండల సర్వేయర్ రామారావు, ఆర్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : రెవెన్యూ గ్రామ సభలతో భూసమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ తెలిపారు. కన్నూరులో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో మాట్లాడారు. రీసర్వేలో ఎటువంటి లోపాలున్నా అర్జీలు పెట్టుకోవాలన్నారు. అనంతరం పలువురు అర్జీలను సమర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌నాయుడు, ఇన్‌చార్జి ఆర్‌ఐ సురేష్, వీఆర్వోలు, స్థానిక నాయకులు, రైతులుపాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గాలిభీమవరం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ గొర్లి రాజేష్, రీ సర్వే డీటీ వై.గణేష్, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో రామఅప్పారావు, సచివాలయ సర్వేయర్లు మాతా ప్రసాద్, లోకేశ్, గ్రామ పెద్దలు గొర్లి రమణ, వాకాడ గోవింద, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


కశింకోట : సోమవరం గ్రామంలో అధికారులు అర్జీల స్వీకరణ

మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయాలి


పీటీడీ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ పోస్టు కార్డు ఉద్యమం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మహిళలకు పీటీడీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పీటీడీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్సుల్లోకి వెళ్లి ప్రయాణికులతో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో విఫలమవుతోందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగమైన పీటీడీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుర్నాథం, భానుమూర్తి యాదవ్, కేవీ మాణిక్యం, ఏడుకొండలు, పీఎస్ దత్తు తదితరులు పాల్గొన్నారు.


బస్సులో పోస్టుకార్డులు చూపుతున్న సుబ్బన్న, ప్రయాణికులు

సీఎం సహాయ నిధికి విశ్వబ్రాహ్మణ సంఘం రూ.లక్ష అందజేత

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద బాధితుల సహాయార్థం అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం రూ.లక్షా 116లను వితరణగా అందజేసింది. ఈ మేరకు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును బుధవారం రాత్రి సంఘం జిల్లా అధ్యక్షుడు మత్తుర్తి గంగారామ్ తదితరులు కలిసి సదరు చెక్కును అందజేశారు. రాష్ట్ర కన్వీనర్ సింహాద్రి కనకాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.సూరిబాబు, సున్నం నాగు, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబుకు చెక్కుఅందిస్తున్న ప్రతినిధులు

ఇంటర్ వర్సిటీ తైక్వాండో పోటీలకు డైట్ విద్యార్థిని ఎంపిక

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో వచ్చే నెల 13, 14 తేదీల్లో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీలకు ఇక్కడి డైట్ కళాశాల విద్యార్థిని యు.జయశ్రీ ఎంపికైనట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ టీసీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల జేఎన్‌టీయూ జీవీ విశ్వవిద్యాలయ నిర్వహించిన అంతర్ కళాశాలల తైక్వాండో పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించడంతో ఇందుకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థినిని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ కె.కృష్ణనాగ్, డీన్ అడ్మిన్ కె.ఈశ్వరరావు అభినందించారు.


ఎంపికైన జయశ్రీ

'వసతి గృహాల్లో వార్డెన్ పోస్టుల భర్తీ చేయాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలకు పూర్తిస్థాయిలో వార్డెన్లను నియమించాలని, విద్యార్థులకు రక్షణ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి నూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. రెండు రోజుల క్రితం గాంధీనగరంలోని హాస్టల్‌లో భోజనం పెట్టమని అడిగిన విద్యార్థిని కుక్ మద్యం మత్తులో తీవ్రంగా కొట్టడంతో ఆ విద్యార్థి గాయాలపాలయ్యాడన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వివిధ పార్టీల ప్రతినిధులు కొల్లి చినఅప్పారావు, ఉడింగల నాగేంద్రకుమార్, వనమాల నాగభూషణం, కొల్లి సత్యారావు పాల్గొన్నారు.




























రెండు గ్రామాల్లో ఘనంగా మరిడిమాంబ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్ తదితరులు

కొత్తూరు, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ, కొత్తూరు గ్రామాల్లో మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, బొద్ద పాటి చినరాజారావు, మళ్ల త్రినాథ్, గోవింద, దొడ్డి రమణ, శిలపరశెట్టి బాబీ, పందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై కూటమి నేతలతో సమీక్ష

» సమాయత్తం కావాలని 'పీలా' పిలుపు


ఎన్నికలపై కూటమి నాయకులతో చర్చిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

కొత్తూరు, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఎన్నికలపై కూటమి నేతలతో అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ గురువారం సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కశింకోట మండలంలోని ఆయకట్టు పరీవాహక ప్రాంతంలో ఉన్న ముఖ్య నేతలతో చర్చించారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు అంతా సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీ, కర్రి వెంకట సత్యనారాయణ, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్‌కుమార్, దాసరి బాబు, గంగయ్య, గొబ్బూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు పశువుల పాకలు దగ్ధం

కశింకోట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : పరవాడపాలెంలో బుధవారం అర్ధరాత్రి మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. గొంతిన రమణ, గొంతిన జగ్గారావు, పరవాడ అప్పలనాయుడుకు చెందిన పాకలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో యాభై నాటుకోళ్ళు మృతి చెందాయని బాధితుడు పరవాడ అప్పలనాయుడు తెలిపారు. అలాగే, రమణకు చెందిన వరి కుప్పలు, జగ్గారావుకు చెందిన ఆవు మృతి చెందినట్టు చెప్పారు. ప్రభుత్వం తమను ఆదుకోవాల్సిందిగా బాధితులు కోరుతున్నారు.

మంత్రి రవీంద్రను కలిసిన 'బుద్ద'


చిత్రపటాన్ని బహూకరిస్తున్న బుద్ద

అనకాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, గనుల శాఖల మంత్రి కొల్లు రవీంద్రను గురువారం మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో కలిసి శాలువాతో సత్కరించి, సత్యనారాయణస్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం జిల్లాలోని సమస్యలపై ఇరువురూ కాసేపు చర్చించారు.

విద్యా పథకాలు ప్రారంభించండి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ



ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మకు వందనం వంటి పథకాలు ఇంకా ప్రారంభించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం బాలాజీ అన్నారు. అడ్డరోడ్డులో గురువారం పలు కళాశాలల విద్యార్థులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మకు వందనం వంటి పథకాలు మంజూరు చేయకుండా జాప్యం చేయడంపై మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు. కాలేజీల్లో ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా పథకాల ద్వారా విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, అవసరమైతే అమరావతిలో సీఎం క్యాంప్ ఆఫీసను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సూరి, తరుణ్, రాఘవేంద్ర, రాజు, సురేష్, శివ, అప్పలరాజు పాల్గొన్నారు.



అడ్డరోడ్డులో ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ఉల్లాస్ పథకంపై సమీక్ష

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ పథకం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన వుండాలని ఎంపీడీవో డీ సీతారామరాజు సూచించారు. గురువారం సాయంత్రం ఉల్లాస్ పథకంపై మండల పరిషత్ కార్యాలయంలో మండల కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు, ఐసీడీఎస్ పీవో శ్రీవిద్య పాల్గొన్నారు.

భూముల రీ సర్వే సదస్సు వరం

కోటవురట్ల, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి):రైతులకు భూ రీసర్వే గ్రామసభలు వరమని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. గురువారం చౌడువాడ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో రీసర్వే చేసినప్పుడు భూమి విస్తీర్ణంలో తప్పులు, హెచ్చుతగ్గులు, భూ యాజమాని పేరు మార్పులు, జరిగిన పరిష్కారిస్తామన్నారు. రైతుల నుంచి 77 ఫిర్యాదులు వచ్చినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో డీటీ రమేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ గోపాలకృష్ణ వీఆర్‌వో రమేష్ పాల్గొన్నారు.





టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలవాలి

మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతి రోజూ రెండు గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణుల సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరిగేలా కృషిచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, మలిపెద్ది వెంకటరమణ, ఉరుకుట్ల వెంకటరమణ, ఎం.రమాకుమారి, కురందాసు శివ, వెంకట గిరిధర్, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, గంపల చినరాజు తదితరులు పాల్గొన్నారు.








వెంకన్న పుష్కరిణిలో నాచు తొలగింపు


పుష్కరిణిలో నాచు తొలగింపు పనులు చేపట్టిన దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి పుష్కరిణిలో స్నానాల ఘాట్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ఉపమాక శివాలయానికి నెల రోజులపాటు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ఉపమాక వెంకన్న పుష్కరిణిపై టీటీడీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం కనబర్చడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ టీటీడీ అధికారుల్లో కనీస చలనం కూడా లేదు. దీంతో ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పర్యవేక్షణలో స్వామివారి పుష్కరిణిలో నాచు, వ్యర్థాల తొలగింపు పనులను ప్రారంభించారు.









స్టడీ మెటీరియల్ వితరణ

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం వింగ్స్ ఫౌండేషన్ సమకూర్చిన ఎస్‌ఎం ఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.ఆనంద్, సెక్రటరీ ఎం. జయప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఎస్.శేషుకుమార్, ఏ ప్రవీణ్‌కుమార్, స్కూల్ చైర్మన్ ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు.











'టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి'



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీవైఈఓ పి.అప్పారావు

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ డీఈఓ పి.అప్పారావు ఆదేశించారు. గురువారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థినుల వర్కు పుస్తకాలను పరిశీలించి, పలు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు విద్యాబోధన, తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి ఎండీఎం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్ఎం డీఎస్.భవానీ తదితరులున్నారు.

పెంటకోట తుఫాన్ షెల్టర్ పరిశీలన



తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయప్రకాశరావు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుఫాన్‌గా మారడంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు గురువారం పెంటకోటలో ఉన్న తుఫాన్ రక్షిత భవనాన్ని, లైట్ హౌస్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రం పైకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. తుఫాన్ సంభవించి భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను తుఫాన్ షెల్టరుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మెరైన్ పోలీసు స్టేషను సిబ్బంది పాల్గొన్నారు.

బాలల ప్రతిభా పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి నర్సీపట్నంలో జరగనున్న జిల్లాస్థాయి బాలల ప్రతిభా పోటీల పోస్టర్‌ను గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో జి. సత్యనారాయణ ఆవిష్కరించారు. చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, పద్య పఠనం, వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, తదితర అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు పీఆర్‌టీయూ మండల నాయకులు రామారావు, భద్రరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శ్రీనివాస్ తెలిపారు.

పెద్దిపాలెంలో

వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం పంచాయతీ శివారు పెద్దిపాలెంలో గురువారం వాటర్ ట్యాంకు పనులకు సర్పంచ్ పన్నీరు పాపారావు, కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.30.8 లక్షలతో జల జీవన్ మిషన్ నిధులతో ఇప్పటికే పైపులైను పనులు పూర్తయయ్యాయని, సుమారు 20 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంకు పనులు ప్రారంభించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ మనోజ్‌కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కలిదిండి సతీష్‌రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గణపర్తి రాజుబాబు, టీడీపీ నాయకులు గణపర్తి దొరబాబు, గోపీరాజు, బాబారాజు, చంద్రమౌళి, చంటిరాజు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ డేపై అవగాహన ర్యాలీ

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామంలో ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఆయుర్వేదిక్ డే అవగాహన ర్యాలీ చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మూర్తి రాజు, పీఈటీ రామ్‌కుమార్, పలువురు విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈనెల 29న ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని మెడికల్ ఆఫీసర్ చెప్పారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది దవరసింగి రాంబాబు, డీఎస్‌వీ సాయి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్డరోడ్డులో చైల్డ్ లేబర్ డ్రైవ్

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులతో ఎక్కడైన వెట్టి చాకిరీ చేయించినట్టు తెలిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎలమంచిలి సహాయ కార్మిక అధికారి ఎస్. వెంటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న పలు వ్యాపార సంస్థల్లో గురువారం వెంకటేశ్వరరావు, సిబ్బందితోపాటు బాలల సంరక్షణ ప్రతినిధి పార్వతి ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో బాల కార్మికులు ఎవరైన ఉన్నారా అనే దానిపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అభిజిత్‌ని వెంటనే తెరవాలి

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు



ఆందోళనలో మాట్లాడుతున్న రుత్తల శంకరరావు

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లో గల అభిజిత్ కర్మాగారాన్ని వెంటనే తెరిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రొంగలి శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం కర్మాగారం వద్ద జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యం అక్రమంగా లేఆఫ్‌ని ప్రకటించిందని, ఫలితంగా వెయ్యి మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వం నుంచి కోట్లలో రాయితీలు పొందినప్పటికీ చట్టవిరుద్ధంగా లేఆఫ్ ప్రకటించిన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కర్మాగారంలో వెంటనే ఉత్పత్తి ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, కార్మికులు పాల్గొన్నారు.

పాల ధరను పెంచాలంటూ రైతుల ఆందోళన



పాల సేకరణ కేంద్రం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తగ్గించిన పాల ధరలను పెంచాలంటూ పెదపాడు, ఉప్పవరం పాడి రైతులు గురువారం పాల సేకరణ కేంద్రాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ పశుదాణా ధరను విపరీతంగా పెంచుతూ పాల ధరను తగ్గించడం అన్యాయమన్నారు పెంచిన ఫీడ్ ధరను తగ్గించటంతోపాటు తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 29న విశాఖ డెయిరీ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమాల్లో రామ సదాశివరావు, బుద్ధ రంగారావు, ఎస్.బ్రహ్మాజీ, ఎ.మహాలక్ష్మి నాయుడు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో ట్రాఫిక్ జామ్

రాత్రి ఏడు నుంచి పది గంటల వరకు నిలిచిన వాహనాలు



గురువారం రాత్రి హరిపాలెంలో అయిన ట్రాఫిక్ జామ్

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రోడ్డులో గల హరిపాలెంలో గురువారం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. రాత్రి ఏడు గంటల నుంచి పది గంటల వరకు వాహనాలు నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ రోడ్డులో ప్రతి రోజూ వందల కొద్ది వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. సెజ్ కర్మాగారాల్లో ఉద్యోగులు, కార్మికులను తీసుకువెళ్లే బస్సులు వందల సంఖ్యతో తిరుగుతాయి. హరిపాలెంలో రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్ షాపులు పెట్టేస్తున్నారు. రోడ్డు ఎడ్జిని ఆనుకొని వస్తువులు పెడుతున్నారు. వాహనాలు వస్తువుల మీదికి రాకుండా బోర్డులతోపాటు, పెద్ద పెద్ద రాళ్ల పెడుతున్నారు. దీంతో ఎదురెదురుగా వచ్చే రెండు వాహనాలు తప్పుకోవడం చాలా కష్టమవుతోంది. మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం ఆరు గంటల తర్వాత సెజ్ కర్మాగారాల బస్సులు వందల సంఖ్యలో వస్తుంటాయి. ఇటువంటి సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి తోడు సెజ్‌కి వచ్చే భారీ వాహనాలు. కనీసం రోడ్డు ఎడ్జి దిగడానికి కూడా వీలులేకపోవడంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ద్విచక్రవాహనాలు కూడా తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు తగిన చర్యలు తీసుకొని ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

వెంకన్న పుష్కరిణిలో నాచు తొలగింపు



పుష్కరిణిలో నాచు తొలగిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామివారి పుష్కరిణిలో స్నానాల ఘాట్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ఉపమాక శివాలయానికి నెల రోజులపాటు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ఉపమాక వెంకన్న పుష్కరిణిపై టీటీడీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం కనబర్చడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ టీటీడీ అధికారుల్లో కనీస చలనం కూడా లేదు. దీంతో ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పర్యవేక్షణలో స్వామివారి పుష్కరిణిలో నాచు, వ్యర్థాల తొలగింపు పనులను ప్రారంభించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీవైఈఓ పి.అప్పారావు

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ డీఈఓ పి.అప్పారావు ఆదేశించారు. గురువారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థినుల వర్క్ పుస్తకాలను పరిశీలించి, పలు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు విద్యాబోధన, తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి ఎండీఎం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం డీఎస్.భవానీ ఉన్నారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరావు. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఉండే రీతిలో పార్టీ సభ్యత్వ నమోదును బాధ్యతగా చేపట్టాలన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఎలమంచిలి, రాంబిల్లి మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు ప్రజారంజక పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల పనితీరు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ద్వారా ప్రజలకు వర్తించే ఉపయోగాలను వివరించాలన్నారు. ప్రతి నేత, కార్యకర్త సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, కర్రి శివ, నానాజీ తదితరులంతా సభ్యత్వ నమోదుపై పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, మండల పార్టీ అధ్యక్షులు ఇత్తంశెట్టి రాజు, దిన్‌బాబు, నాయకులు రాజాన సూర్యనాగేశ్వరరావు, కాండ్రకోట చిరంజీవి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఆడారి ఆదిమూర్తి, కొఠారు సాంబ, రాజాన వెంకునాయుడు, నేతలు బొద్దపు శ్రీను, బొద్దపు నాగేశ్వరరావు, నానేపల్లి సుబ్బయ్యనాయుడు, కరణం రవి, గొర్లె బాబూరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

అచ్యుతాపురం: టీడీపీ శ్రేణులంతా ఐకమత్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో అచ్యుతాపురం, మునగపాక మండలాల ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో టీడీపీ తిరుగులేని శక్తిగా మారిందన్నారు. ఈనెల 26 నుంచి జరగబోయే సభ్యత్వ నమోదు భారీ స్థాయిలో జరగాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ప్రతి సభ్యునకు ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సాధారణ మరణానికి అంత్యక్రియ ఖర్చుల కింద రూ.పది వేలు ఇస్తారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, అచ్యుతాపురం, మునగపాక మండలాల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, దొడ్డి శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, పీలా తులసీరామ్, బి.శ్రీనివాసరావు, పి.కొండబాబు, ఎన్. నర్సింగరావు పాల్గొన్నారు.

డిమాండ్లు ఆమోదిస్తే భూములిస్తాం

» ఆర్డీవోకు బార్క్ నిర్వాసిత రైతులు స్పష్టీకరణ
» దొప్పెర్లలో గ్రామసభ ఏర్పాటు చేయాలి
» కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్న ఆర్డీవో



బార్క్ నిర్వాసితులతో సమావేశమైన ఆర్‌డీఓ షేక్ ఆయాషా

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన కోర్కెలు తీరిస్తే భూమి ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతం లేదని బార్క్ నిర్వాసిత రైతులు ఆర్డీవో షేక్ ఆయాషాకి తేల్చి చెప్పారు. గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసిత నాయకులతో ఆమె సమావేశమయ్యారు. బార్క్ నిర్వాసిత కాలనీకి దొప్పెర్ల పంచాయతీలోని వివిధ సర్వే నంబర్లలో 91.33 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించి 2010 ఆగస్టులోనే ఏపీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే అప్పటి నుంచి ధర నిర్ణయించకపోవడంతో రైతులు భూమిని ఇవ్వకుండా సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిని సర్వే జరిపి వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులు ప్రయత్నించినా ప్రతిసారి రైతులు అడ్డుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సమస్యకు తెరదించాలని ఆధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆర్‌డీఓ గురువారం బార్క్ నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే తమ భూమికి 2010లో నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఇప్పటి మార్కెట్ ధరలు ప్రకారం పరిహారం చెల్లించాలని, బార్క్ రోడ్డు పక్కన వేసిన కంచెను ఆనుకొని 10 అడుగుల వెడల్పున సర్వీస్ రోడ్డు నిర్మించాలని, రావిపాలెం గ్రామాన్ని తరలించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, భూసేకరణలో గృహాలు కోల్పోయిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, దొప్పెర్లలో గ్రామసభ ఏర్పాటుచేసి తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాతే భూముల సర్వేకు అనుమతిస్తామని వారు స్పష్టం చేశారు. దీనిపై ఆర్డీఓ షేక్ ఆయాషా సానుకూలంగా స్పందించారు. ఈ డిమాండ్లను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అలాగే త్వరలో దొప్పెర్లలో గ్రామసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జీవీ జనార్దనరావు, డీటీ శ్యామ్, నిర్వాసిత నాయకులు పల్లి శేషగిరిరావు, కొల్లి వరహాలరావు, సరోజారావు నార్మల రామకృష్ణ, తమరాన తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి వెల్చూరు పాఠశాల

» శిథిల భవనాల నుంచి మార్చిన విద్యాశాఖాధికారులు
» శిథిల భవనాలు ప్రాంగణంలోకి ఎవరూ వెళ్ల వద్దని బోర్డు ఏర్పాటు
» హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చిన దృశ్యం



శిథిల భవనాల ప్రాంగణంలోకి ఎవరూ వెళ్లవద్దని బోర్డు ఏర్పాటు చేసి విద్యాశాఖాధికారులు

రాంబిల్లి, అక్టోబరు 24: మండలంలోని వెల్చూరు ప్రాథమిక పాఠశాలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోకి బుధవారం మార్చారు. గ్రామంలోని ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకొన్న విషయాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'దినదిన గండం' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారులు ఎం.సూర్యారావు, సత్యనారాయణ వెల్చూరులో శిథిల భవనాలను పరిశీలించారు. భవనాలు మరింత ప్రమాదకరంగా ఉండడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చారు. అంతేకాకుండా శిథిల భవనాలు ప్రాంగణంలోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. నూతన పాఠశాల భవనాలకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామని ఎంఈవోలు సూర్యారావు, సత్యనారాయణ తెలిపారు. పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ భవనానికి తలుపులు, గచ్చులు లేవని, వీటిని త్వరితంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏటికొప్పాకలో విద్యుత్ స్తంభం మార్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాక బజారువీధిలో జనం సంచరించే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఈపీడీసీఎల్ అధికారులు తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 22వ తేదీన 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. జనం సంచరించే బజారు వీధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా పథకాలు ప్రారంభించండి

» ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మకు వందనం వంటి పథకాలు ఇంకా ప్రారంభించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం బాలాజీ అన్నారు. అడ్డరోడ్డులో గురువారం పలు కళాశాలల విద్యార్థులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మకు వందనం వంటి పథకాలు మంజూరు చేయకుండా జాప్యం చేయడంపై మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు. కాలేజీల్లో ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా పథకాల ద్వారా విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, అవసరమైతే అమరావతిలో సీఎం క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూరి, తరుణ్, రాఘవేంద్ర, రాజు, సురేష్, శివ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పథకంపై సమీక్ష

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ పథకం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన వుండాలని ఎంపీడీవో డీ సీతారామరాజు సూచించారు. గురువారం సాయంత్రం ఉల్లాస్ పథకంపై మండల పరిషత్ కార్యాలయంలో మండల కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. చిత్తశుద్ధితో ఈ పథకం గురించి ప్రచారం చేయాలన్నారు.

నిబంధనలు పాటించని వైన్‌షాపులపై చర్యలు

» ఎక్సైజ్ సీఐ తేజ వెంకటకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని మద్యం షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ తేజ వెంకట కుమార్ హెచ్చరించారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నూతన మద్యం పాలసీ 2024-26లో భాగంగా ఎలమంచిలి సర్కిల్ పరిధిలోని ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో 20 ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు మద్యం విక్రయించరాదన్నారు. అలాగే లూజ్ అమ్మకాలు జరపరాదన్నారు. లైసెన్స్ పొందిన షాపుల నుంచి మద్యం తీసుకొని అనధికారికంగా గ్రామాల్లో విక్రయించడం, గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించడం చట్టరీత్యా నేరం అన్నారు. అలాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని, దీనికి గ్రామ పెద్దలు నాయకులు సహకరించాలని కోరారు. అలాగే గ్రామాల్లో సారా తయారీ, అక్రమ మద్యం, మత్తు పదార్థాలు అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

27న ప్రశాంతిలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట అప్పారావు

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారెశెట్టి వేంకట అప్పారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంబరాల్లో భాగంగా క్విజ్, సైన్స్ ప్రయోగాల పోటీ, చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 70 పాఠశాలల నుంచి 70 టీములు పాల్గొంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసార్, జేవీవీ ప్రతినిధి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీవీ జనార్దన రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తుఫాన్ ఒడిశాలోని పూరీ-సాగర్ ద్వీపం మధ్య తీరం దాటే అవకాశం ఉందన్నారు. జిల్లాకు అంతగా ప్రభావం లేకపోయినప్పటికీ తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని ఆయన కోరారు.

రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



కృష్ణాపురంలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు వరహాలు

ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రీ సర్వే గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వరహాలు కోరారు. గురువారం కృష్ణాపురంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ప్రజా సమస్యలు పరిష్కారం గురించి ఆయన వివరించారు. అనంతరం రీ సర్వే తదితర వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులతో ఎక్కడైన వెట్టి చాకిరీ చేయించినట్టు తెలిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎలమంచిలి సహాయ కార్మిక అధికారి ఎస్. వెంటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న పలు వ్యాపార సంస్థల్లో గురువారం వెంకటేశ్వరరావు, సిబ్బందితోపాటు బాలల సంరక్షణ ప్రతినిధి పార్వతి ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో బాల కార్మికులు ఎవరైన ఉన్నారా అనే దానిపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పెంటకోట తుఫాన్ షెల్టర్ పరిశీలన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుఫాన్‌గా మారడంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు గురువారం పెంటకోటలో ఉన్న తుఫాన్ రక్షిత భవనాన్ని, లైట్ హౌస్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రం పైకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. తుఫాన్ సంభవించి భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను తుఫాన్ షెల్టరుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మెరైన్ పోలీసు స్టేషను సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామశాఖ అధ్యక్షులు ప్రతి రోజూ రెండు గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణుల సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరిగేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, మలిపెద్ది వెంకటరమణ, ఉరుకుట్ల వెంకటరమణ, ఎం.రమాకుమారి, కురందాసు శివ, వెంకట గిరిధర్, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, గంపల చినరాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన


ఏబీఎం కళాశాలలో రక్తాన్ని దానం చేస్తున్న దాతలు

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడి ఏబీఎం కళాశాలలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎం, రిషి, శ్రీసాయి, ఎంఎల్ఏఎస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 70 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. దాతలను లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్లు డాక్టర్ అధికారి గోపాలరావు, దస్త్రాల రాఘవేంద్రరావు అభినందించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటైన ఈ శిబిరాన్ని తొలుత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మారుతీకృష్ణ రక్తదానం చేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ మహేశ్, ఏబీఎం, రిషీ విద్యా సంస్థల కరస్పాండెంట్లు అకంరెడ్డి గిరిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'నేటి నుంచి గ్రామాల్లో పశు గణన'

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాలలో శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు పశు గణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీడబ్ల్యూ రాంబాబు తెలిపారు. ఇందు కోసం నర్సీపట్నం మండలం నుంచి ఎనిమిది మంది, గొలుగొండ మండలం నుంచి తొమ్మిది మంది సిబ్బందిని విషయ సేకరణ అధికారులుగా నియమించినట్టు చెప్పారు. డాక్టర్ పుష్ప, డాక్టర్ రమేశ్, డాక్టర్ శిరీషా సూపర్ వైజర్లుగా వ్యవహరిస్తారన్నారు. పశు గణన అన్ని రకాల పథకాలు రూపకల్పనకు, టీకాలు, మందులు తయారీకి ఉపయోగ పడుతుందని వివరించారు. పశు గణన కోసం విషయ సేకరణ అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు పశువులు, మేకలు, గొర్రెలు వివరాలు తెలియజేయాలని సహకరించాల్సిందిగా ఆయన ప్రజలను కోరారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

మాకవరపాలెం, అక్టోబరు 24 : గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన నర్సీపట్నం ప్రెస్ క్లబ్ సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టులు రాసే కథనాలు ప్రజల్లో ఎంతో చైతన్యం నింపుతాయన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు, ఆరోగ్య విషయంలో తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆర్డీవో వీవీ రమణ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎస్ఐ దామోదర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జర్నలిస్టుల రాష్ట్ర ప్రతినిధులు బీఎల్ స్వామి, మద్దాల రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కిశోర్ తదితరులతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

వసతి గృహాలు తనిఖీ

- క్షుణ్ణంగా పరిశీలించిన నర్సీపట్నం సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్
- వసతులు, విద్యాబోధన, భోజనం మెనూ తదితరాలపై ఆరా
- విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు


పెదబొడ్డేపల్లి ఎస్సీ వసతి గృహంలో సౌకర్యాలను తెలుసుకుంటున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం రూరల్/గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ పెదబొడ్డేపల్లిలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వంటశాల పరిసరాలు, భోజనం తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. బీసీ వసతి గృహంలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో వార్డెన్‌కు సూచనలు చేశారు. హాస్టల్‌లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సూచించారు. అలాగే, గొలుగొండ మండలంలో గల బీసీ, ఎస్సీ వసతి గృహాలను గురువారం రాత్రి జడ్జి షియాజ్‌ఖాన్ తనిఖీ చేశారు. తొలుత గొలుగొండలో గల బీసీ వసతి హాస్‌కి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం రుచికరంగా వడ్డిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. అనంతరం జోగంపేటలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందించాలని వార్డెన్లకు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, వార్డెన్లు మడ్డు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్త ఎల్లవరం విద్యార్థినులు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త ఎల్లవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో హ్యాండ్‌బాల్ పోటీ లకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి గురువారం తెలి పారు. ఇటీవల విశాఖపట్నంలోని శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు బంగారి, జానకి, అనుశ్రీ, రజిత, భవానీ, సత్యవేణి హాజరై అద్భుత ప్రతిభ చూపారన్నారు. దీంతో ఈనెల 26 తేదీ నుంచి 28వ తేదీ వరకు తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సర్పంచ్ కొల్లి రాంబాబు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ రాజులునాయుడు అభినందించారు.

పుత్తడిగైరంపేటలో ఉపాధి హామీ వీఆర్‌పీపై విచారణ

- అవకతవకలకు పాల్పడినట్టు గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు
- చేపట్టిన పనులు పరిశీలించి, సచివాలయంలో ఎంపీడీవో, ఏపీవో వివరాల సేకరణ


అవకతవకల ఆరోపణలపై విచారణ చేపడుతున్న అధికారులు

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుత్తడిగైరంపేటలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనుల్లో వీఆర్‌పీ అవకతవకలకు పాల్పడ్డారని అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఎంపీడీవో మేరీరోజీ, ఉపాధి హామీ ఏపీవో కె.సూర్యమణి, ఈసీ రాధిక విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆర్‌పీ నాయుడుతో పాటు పలువురు స్పందనలో జిల్లాకలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వీఆర్‌పీ వివిధ పనులకు కనీస ఎస్టిమేట్ లేకుండా గత నాలుగేళ్లుగా చేపడుతున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో ఆయా పనులను సదరు అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ప్రజల సమక్షంలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నామని ఎంపీ డీవో తెలిపారు.

అటవీ శాఖ మొక్కుబడి దాడులు

- వేములపూడి సామిల్లులో నాలుగు అడుగుల టేకు కలప మాత్రమే స్వాధీనం

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా.. వేములపూడిలోని ఒక సా మిల్లులో దాడులు నిర్వహించిన అటవీ సిబ్బంది నాలుగు ఘనపుటడుగుల టేకు కలపను మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. అన్నవరం, వేములపూడి సా మిల్లుల యజమానుల మధ్య కొద్ది నెలలుగా ఆధిపత్య పోరు సాగుతున్నది. పరస్పరం కేసులు పెట్టుకునే వరకు దారి తీసింది. నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏ జాతి కలపైనా కోటవురట్ల మండలం అన్నవరంలోని నాయుడు సా మిల్లుకి తరలించి కోయించడానికి అటవీ అధికారులు సహకరిస్తున్నారని, మిగిలిన సా మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. అక్రమ కలపను నాయుడు సా మిల్లులో కోయిస్తున్నారని, అధికారులు తనిఖీలకు వచ్చే సమయానికి కలపను మిల్లు బయట పడేస్తున్నారని అటవీ శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మరక్షక్ సిబ్బందితో కలిసి అన్నవరం సా మిల్లులో తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి అక్రమ కలప దొరకలేదని ప్రకటించారు. ఈ ప్రాతంలో చెట్లు నరికి అక్రమంగా తరలిస్తున్నారని ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

వేములపూడి సా మిల్లుపై దాడులు

నర్సీపట్నం రేంజ్ పరిధిలో పని చేస్తున్న ఎఫ్ఎస్‌వో, బీట్ ఆఫీసరు, ఏబీవోకి వేములపూడి సామిల్లులో అక్రమ కలప ఉందని ముందస్తు సమాచారం వచ్చింది. సదరు అటవీ సిబ్బంది విజిలెన్స్ డీఎఫ్‌వో దృష్టిలో పెట్టి గురువారం వేములపూడి సా మిల్లులో తనిఖీలు చేశారు. కోతకోస్తున్న నాలుగు అడుగుల టేకు కలప స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని నుంచి లిఖితపూర్వంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ కలపకు గతంలో స్క్వాడ్ డీఎఫ్‌వో కేసు రాశారని కలప యజమాని సుకల సత్యనారాయణ రశీదుని అటవీ అధికారులకు చూపించారు. దీనిపై ఎఫ్ఎస్‌వో అప్పారావుని వివరణ కోరగా.. ఇంకా కేసు రాయలేదన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులనాయుడు

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

ఆత్మీయ సమావేశంలో పీఆర్‌టీయూ, మిత్ర సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్‌టీయూ, మిత్ర సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. 2018 నవంబరు ఒకటి నుంచి 2024 నవంబరు ఒకటి మధ్య ఆరు సంవత్సరాల కాలంలో మూడు సంవత్సరాలు హైస్కూల్‌లో పనిచేసిన ఉపాధ్యాయులను అర్హులుగా గుర్తిస్తారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనుమతించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రస్తుతం ఉన్న జీవో ప్రకారం శిశు సంరక్షణ సెలవులు 180 రోజులు మంజూరు చేస్తున్నారని, ఆ సెలవులు బిడ్డకు 18 సంవత్సరాలు వచ్చే వరకు వాడుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. రిటైర్మెంట్ అయ్యే వరకు సెలవులు ఉపయోగించుకునే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్, ఎంఎస్ ప్రసాద్ అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సుందరకోట పంచాయతీలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటుకు వినతి

నాతవరం, అక్టోబరు 24 : మండలంలోని సుందరకోట పంచాయతీ సిరిపురం, తొర్రడ అసనగిరి, ముంతమామిడి తదితర ఎనిమిది కొండమీద మీద గిరిజన గ్రామాలకు సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని గిరి మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి బండి గంగరాజు కోరారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ గ్రామాలకు ఇనుప స్తంభాలు వేసి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారన్నారు. ఈ కారణంగా వర్షాలు కురిసేటప్పుడు మూగజీవులు ఏ మాత్రం ఇనుప స్తంభాలను తాకినా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయని వాపోయారు. ప్రస్తుతం కొండ మీద గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా ఉందని అధికారులు సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎస్పీ తుహిన్‌సిన్హాను కలిసిన తాతయ్యబాబు


ఎస్పీని సత్కరిస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాను రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో భూ సమస్యల శాశ్వత పరిష్కారమే రెవెన్యూ సభల లక్ష్యమని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. గురువారం కేపీ.అగ్రహారంలో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రీ సర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఈ సభలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు. ఈ సభలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామూర్తి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చోడవరం నియోజకవర్గం అధోగతి పాలైందని, కూటమి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. పి.భీమవరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నిర్లక్ష్య పాలనతో రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వంతెనలు కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, రిజర్వాయర్ల ఆధునికీకరణ పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి దూది రాజేష్, మండల అధ్యక్షుడు సీతా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనేతరుల సాగు భూములు ఆన్‌లైన్ చేయాలి'


సమావేశంలో పాల్గొన్న వేణుగోపాల్

కృష్ణాదేవిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో ఉన్న గిరిజనేతరుల సాగు భూములను ఆన్‌లైన్ చేయాలని గొలుగొండ మాజీ జడ్పీటీసీ టికెల తారకవేణు గోపాల్ అధికారులు కోరారు. ఇక్కడి అల్లూరిపార్కులో టీడీపీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొలుగొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందిన గిరిజనేతరులు బ్రిటీష్ కాలం నుంచి 1/70 యాక్టుకు ముందు కొయ్యూరు మండలంలో భూములు సాగు చేస్తున్నారన్నారు. వీరి భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని ఆధా రాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందలేక పోతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో సాగు భూములను ఆన్‌లైన్ చేయమంటున్నామే తప్ప, గిరిజనుల హక్కులకు భంగం కలిగించాలనే ఉద్దేశ్యం తమకు లేదని వివరించారు. గతంలో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గిరిజన ప్రాంతంలో ఉన్న గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని జీవో కూడా జారీ చేశారన్నారు. అదే విధంగా పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్ హయంలో గ్రామ సభ తీర్మానం చేసి ఎటువంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశారన్నారు. ఇందులో భాగంగానే కొయ్యూరు మండలం ఆడాకుల ప్రాంతంలో ఉన్న గిరిజనేతరులు 149 మంది భూము లను ఆన్‌లైన్ చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీ డీఏపీవోకు నెల క్రితం ఆర్డర్ జారీ చేస్తే కావాలనే వాటిని కొంతమంది తప్పుగా సోషల్ మీడియాలో వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మార్పుపై కలెక్టర్‌కు నివేదిక

- నర్సీపట్నం ఆర్డీవో రమణ


వివరాలు సేకరిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో రమణ

మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మార్పుపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఓ భవనంలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తుండడం, ఆ భవనాన్ని తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతుండడం, మరోవైపు భవనాన్ని తమకు ఇస్తే డిగ్రీ విద్యార్థుల తరగతుల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని అధ్యాపకులు విన్నవిస్తుండడంతో సమగ్ర విచారణ చేపట్టి తమకు నివేదిక అందించాలని నర్సీపట్నం ఆర్డీవో రమణకు కలెక్టర్‌కు ఆదేశించారు. ఈ మేరకు గురువారం మాడుగుల వచ్చిన ఆర్డీవో మండల విద్యా శాఖ అధికారులు, తహసీల్దార్ రమాదేవితో భవనాలను పరిశీలించారు. అనంతరం డీఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలతో కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆర్డీవోకు తెలిపారు.

కలిగొట్ల అప్రోచ్ రోడ్డు స్థల పరిశీలన


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో అయిషా

దేవరాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగొట్ల సమీపంలో శారదానదిపై వేసిన బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు అవసరమైన స్థలాన్ని అనకాపల్లి ఆర్డీవో ఎస్.అయిషా గురువారం పరిశీలించారు. ఐదేళ్లకు పైగా బ్రిడ్జి పూర్తి చేసినప్పటికీ వేచలం వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో రాక పోకల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పరిశీలించారు. ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేసేందుకు అవసరమైన రెండు ఎకరాల 30 సెంట్ల భూమిని కలిగొట్లకు చెందిన రైతులతో భూసేకరణపై చర్చించారు. మార్కెట్ రేటు ప్రకారం రైతులకు పరిహారం ఇస్తామని ఆర్డీవో చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలో నాలుగు చిన్నతరహా, ఐదు పెద్దతరహా నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి సూచించారు.

ఇనాం సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలి

రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు

కె.కోటపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌడువాడ గ్రామంలో మూడు తరాలుగా ఇనాం భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ భాగ్యవతికి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడువాడ ఇనాం భూములపై గతంలో ప్రభుత్వం, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. ఆయన వెంట సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కుమార వెంకటరమణ, సంఘం సభ్యులు కుమార విశ్వనాథం, సన్యాసినాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థులు

దేవరాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి.రఘు గురువారం తెలిపారు. అనకాపల్లిలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా బాలుర, బాలికల టెన్నీకాయిట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన పి.సాయికుమార్, ఎస్.మణికుమార్ అండర్-14, అండర్-17 విభాగంలో ఎంపికైనట్టు చెప్పారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావులను ఆయన అభినందించారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించండి

- బీసీ హాస్టల్‌ను సందర్శించిన న్యాయమూర్తి

రోలుగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో విద్యార్థులకు తగిన సదుపాయాలు కల్పించాలని, నాణ్యమైన విద్యనందించాలని నర్సీపట్నం సీనియర్ సవిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ సూచించారు. రోలుగుంట బీసీ హాస్టల్‌ను గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, వసతుల గురించి ఆరా తీశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గదులు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్ భవనం మరమ్మతులకు గురైందని, దీనిపై నివేదిక అందస్తామని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలతో వసతి గృహాలను తనిఖీ చేస్తున్నామని, అక్కడ ఉన్న సదుపాయాలను, అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి హైకోర్టుకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ హరిగోపాల్, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గోవాడలో లోవోల్టేజి సమస్య పరిష్కారం

- ఈపీడీసీఎల్ ఏఈ ఉదయకుమార్

చోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించామని ఈపీడీసీఎల్ రూరల్ ఏఈ టి.ఉదయకుమార్ తెలిపారు. గోవాడలో విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి సమస్యపై స్థానికంగా వినియోగదారులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సమస్య పరిష్కరించినట్టు ఏఈ వివరించారు.

ఉప్పులో అయోడిన్‌తో ఆరోగ్యానికి మేలు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప్పులో ఉండే అయోడిన్ ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుందని గ్రామ సర్పంచ్ కంఠే పద్మరేఖ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అయోడిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల మానసిక, శారీరక వైకల్యం వస్తుందని చెప్పారు. ఈ ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది రాధ, బాల, మహాలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవాలయాల ట్రస్టు బోర్డులో బ్రాహ్మణులకు అవకాశం హర్షణీయం


శ్రీనివాస్

చోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాలయాల్లోని ట్రస్టు బోర్డు నియామకాల్లో ఇద్దరు బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు యు.శ్రీనివాస్ చెప్పారు. ఆలయాల ట్రస్టు బోర్డులో ఇద్దరు బ్రాహ్మణులను నియమించడం వల్ల బ్రాహ్మణ సామాజిక వర్గానికి గుర్తింపు ఇచ్చినట్టయిందన్నారు. హిందూ ఆగమశాస్త్రాలపై అవగాహన కలిగిన బ్రాహ్మణులకు ట్రస్టు బోర్డులో అవకాశం కల్పించడం వల్ల ఆలయాల నిర్వహణ మరింత మెరుగుపడుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

వార్డు సభ్యుల సహకారంతోనే గ్రామాభివృద్ధి

చీడికాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వార్డు సభ్యుల సహకారంతోనే గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుందని కోనాం సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ అన్నారు. కోనాం సచివాలయంలో గురువారం జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.74 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సిరికి సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ కంటిముఖి సత్యవతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

అరకులోయ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్హుల పింఛన్లు, రేషన్ కార్డులను తొలగించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోపు అనేక నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం తొలగించిన పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చే బాధ్యతను కూటమి ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలు లేకుండా చూడడమే బాబు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ పి.అమ్మన్న, ఎంపీటీసీ సభ్యుడు కె.సాయిరాం, సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, మాజీ సర్పంచ్ పి.రామలింగం, నాయకులు త్రినాథ్, డి.రమేష్, అప్పలరాజు, డేవిడ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

» టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర



సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

డుంబ్రిగుడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. పార్టీ మండల శ్రేణులతో గురువారం సభ్యత్వ నమోదుపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంట్లోను తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండి తీరాలని స్పష్టం చేశారు. అరకు నియోజకవర్గ శ్రేణులంతా సభ్యత్వ నమోదులో నిమగ్నమై ఉండాలని సూచించారు. ప్రతీ కుటుంబంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఉండేలా సభ్యత్వ నమోదు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన రమేశ్‌నాయుడు



మంత్రి సంధ్యారాణితో రమేశ్

పాడేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి టూరిజం కార్పొరేషన్ సభ్యుడు కేవీ.రమేశ్‌నాయుడు గురువారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని గుమ్మడి సంధ్యారాణి చెప్పినట్టు రమేశ్‌నాయుడు తెలిపారు.

అయ్యో పాపం విద్యార్థులు

» పీహెచ్‌సీలో చికిత్స పొంది రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు చేరిన వైనం



పీహెచ్‌సీ నుంచి గుమ్మకోట పాఠశాలకు నడిచివెళుతున్న విద్యార్థులు

అనంతగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట గురుకుల పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు గురువారం ఇబ్బంది పడ్డారు. వీరు అనారోగ్యానికి గురికావడంతో వైద్య సేవల కోసం రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న భీమవరం పీహెచ్‌సీకి ఏఎన్ఎం కాలినడకన తీసుకువెళ్లింది. చికిత్స అనంతరం నీరసంగా ఉన్న ఆ విద్యార్థులను తిరిగి నడిపించుకుంటూ గుమ్మకోట పాఠశాలకు తీసుకువచ్చింది. దీంతో ఆ విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. నీరసంగా ఉన్న వారిని ఆటోలో తీసుకువెళ్లి, తీసుకువస్తే బాగుండేదని తోటి విద్యార్థులు చర్చించుకున్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపే విధానం ఇదేనా అని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలు భర్తీచేయాలి

» టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు



మెడికల్ సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న కూటమి నాయకులు

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలు భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు కోరారు. గురువారం కూటమి నాయకులు ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. మెడికల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి రోగులకు అందుబాటులోనున్న వైద్యసేవలు, అవసరమైన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతి సేవలను అభినందిస్తూ ఆమెకు సన్మానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్నప్పటికీ అందుబాటులోనున్న వైద్యులు రోగులకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. ప్రధానంగా ఏరియా ఆస్పత్రిలో పశు వైద్యాధికారి, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల రోగులను కేజీహెచ్, పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించాల్సివ స్తుందన్నారు. డాక్టర్ ప్రభావతి ఆస్పత్రిలో పలు మార్పులు తీసుకొచ్చారన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించడతో పాటు రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆదివాసీలకు మెరుగైన సేవలు అందించే ప్రతీ వైద్యులను ఆదివాసీలు మర్చిపోలేరన్నారు. ఆస్పత్రి సమస్యలను టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, అబ్బాయిదొర, కేశ్వరరావు, గాంధీ పడాల్, అప్పారావు, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, నాయకుడు పండు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో భాగస్వాములు కండి

టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో ప్రతీ కార్యకర్త భాగస్వాములు కావాలని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. కుమ్మరిపుట్టులోని నివాస గృహం వద్ద గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ కల్పిస్తున్న సదుపాయాలను గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వం ఉన్న టీడీపీ కార్యకర్త మరణిస్తే పార్టీ మట్టి ఖర్చులకు రూ.10 వేలుతో పాటు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తున్నదన్నారు. తెలుగుదేశం పార్టీ జెండా పట్టిన ప్రతీ కార్యకర్త సభ్యత్వం తీసుకొనేలా పార్టీ ముఖ్య నాయకులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగపూజారి శివకుమార్, ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, అరకు పార్లమెంట్ మహిళా కార్యదర్శి డిప్పల వెంకటకుమారి, ఐటీడీపీ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్, పార్టీ మండల అధ్యక్షులు కూడి రామునాయుడు, కొండలరావు, ముక్కల మహేష్, పూర్ణచందరరావు, పార్టీ ముఖ్య నాయకులు దొరబాబు, కళ్యాణం, భీమ్‌బాబు, కిముడు విశ్వ, తదితరులు పాల్గొన్నారు

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

» పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స



మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. మండలంలోని మోదాపల్లిలో గురువారం నిర్వహించిన పార్టీ 7వ మండల మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..పార్టీ జిల్లా స్థాయి మహాసభలను డిసెంబరు 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి 500 మంది వరకు పార్టీ ముఖ్యనాయకులు హాజరు కానున్నారన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి, జీవో నెంబరు 3 రిజర్వేషన్ సాధన, కాఫీ రైతుల గిట్టుబాటు ధరలు, పీవీటీజీల సమస్యలపై తీర్మానం చేసి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు ప్రణాళిక రూపొందించాలని తీర్మాణం చేయనున్నామన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ పాలన గత ప్రభుత్వానికి భిన్నంగా లేదన్నారు. ఇసుక, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటే ఉన్నాయన్నారు. పాడేరులో నూతన జిల్లా కేంద్రం ఏర్పాటు చేసినప్పటికి ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు కూడా చేయలేదన్నారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు నవంబరు 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజా హోరు పేరిట చేపట్టే ప్రచార కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అధిక సంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కమిటీ ఏర్పాటు

సీపీఎం మహాసభలో 13 మందితో మండల నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. మండల కార్యదర్శిగా ఎల్.సుందరరావు ఎంపికయ్యారన్నారు. కమిటీ సభ్యులుగా పాలికి లక్కు, సోమెలి చిట్టిబాబు, తకిల్లో సత్యనారాయణ, డూరు బొజ్జన్న, జె.ఆనంద్‌రాజు, ఎస్.నాగరాజు, ప్రసాద్, పి.జీవన్ కృష్ణ, రాజు, కాంతమ్మ, సూర్యకుమారి, వరలక్ష్మి ఎంపికైనట్టు చెప్పారు.

ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రుల ఆందోళన



ఉపాధ్యాయులను నియమించాలని ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

సీలేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ పిల్లల భవిష్యత్ అంధకారంలోకి పోతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బడిఈడు పిల్లలతో కలసి గురువారం కొమ్ములవాడలో నిరసన తెలిపారు. సుమారు 38 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడ్ని జూలైలో బదిలీ చేశారని, అతని స్థానంలో వేరొకరిని నియమించకపోవడంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేవారు లేక ఆకతాయిలుగా తయారవుతున్నారని వాపోయారు. పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ఇప్పటికే పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు మండిపడ్డారు.దీంతో చేసేది లేక పాఠశాల ఎదుట ఆందోళనకు దిగామని వారు స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు.



నెస్టు కమిషనర్ నుంచి ప్రసంశా పత్రం అందుకుంటున్న విద్యార్థి గణేశ్... (ఇన్‌సెట్‌లో) విద్యార్థి గణేశ్

అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సెమినార్‌లో ఆదివాసీ విద్యార్థి సత్తా

గూడెంకొత్తవీధి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో జరిగిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సెమినార్‌లో స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల విద్యార్థి సత్తా చాటాడు. 'ఆరోగ్యం, ఆహారం నాణ్యత' అనే అంశంపై ఆంగ్ల భాషలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నాడు. వివరాల్లోకి వెళితే... చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ సత్యవరణం గ్రామానికి చెందిన మామిడి గణేశ్ జీకే వీధి ఈఎంఆర్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గణేశ్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు ఇవ్వడంతో దేశ రాజధానిలో జరిగే అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సెమినార్‌లో పాల్గొనేందుకు ఏపీ నుంచి నేషనల్ ఎడ్యుకేషన్ ఫర్ ట్రైబల్ స్టూడెంట్(నెస్టు) అధికారులు ఎంపిక చేశారు. ఈ నెల 22వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సెమినార్‌లో గణేశ్ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. దీంతో అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ నిర్వాహకులు విద్యార్థి గణేశ్‌ను అభినందిస్తూ ప్రశంసాపత్రం, జ్ఞాపికను నెస్టు కమిషనర్ అజాత్ కుమార్ శ్రీవాత్సవ చేతులు మీదుగా అందజేశారు. తమ పాఠశాల విద్యార్థి జాయతీ స్థాయిలో గుర్తింపు సాధించడం సంతోషంగా ఉందని, విద్యార్థిని అభినందిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎంవీ రమణ, గ్రంథాలయ ఉపాధ్యాయుడు రవి తెలిపారు.

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీఎఫ్‌డీసీ కాఫీ ఎస్టేట్‌లో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి మాట్లాడుతూ ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం కాఫీ పండ్ల సేకరణ, కూలి ధరలు పెంచాలన్నారు. ప్రతి కార్మికుడుని 26రోజులు పని కల్పించాలన్నారు. కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాఫీ కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించకుంటే ఈ నెల 31వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంపురంగి బుజ్జిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు ఎంపీడీవోగా ఎస్కేవీ ప్రసాద్



ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఎంపీడీవోగా ఎస్కేవీ ప్రసాద్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రమేష్‌నాయుడు అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డిగా పనిచేస్తున్న ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.

ఎస్ఐగా కిశోర్‌వర్మ బాధ్యతల స్వీకారం



ఎస్ఐ కిశోర్‌వర్మ

కొయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఎస్ఐగా కిశోర్‌వర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా నౌపడాలో ఎస్ఐగా పనిచేస్తున్న వర్మను బదిలీపై పోలీసు ఉన్నతాధికారులకు ఇక్కడ నియమించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన నాగార్జున ఎటపాక బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ వర్మ మాట్లాడుతూ గంజాయి, నాటుసారా వంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

సభ్యత్వాల నమోదుకు కృషి చేయాలి: చిట్టిబాబు

జి.మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదుకు పార్టీ నేతలు కృషి చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి నిర్వహించే సభ్యత్వాలపై నాయకులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభ్యత్వాలు పొందిన వారికి మట్టి ఖర్చులకు రూ.10 వేలు, రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు బీమా ఉంటుందని చెప్పారు. సభ్యత్వ రుసుం రూ.100 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. మండలంలోని 17 పంచాయతీలలో సభ్యత్వాలు నమోదుకు కార్యకర్తలతో పాటు నేతలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామారావు, అప్పారావు, నాగబ్బాయి, లక్ష్మణరావు, పిన్నయ్యదొర, బాలయ్యదొర, మహేశ్, రామకృష్ణ, నారాయణరాజు, బాలక్రిష్ణ, కామరాజు, రాంబాబు పాల్గొన్నారు.

26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ మండల కార్యదర్శి తదితరులు

కొయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 పంచాయతీల పరిధిలో ఈ నెల 26 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం యూనిట్, బూత్ ఇన్‌చార్జులు యాప్ ద్వారా నమోదు చేయాలని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు సూచించారు. పార్టీ సభత్వ నమోదుపై కొండగోకిరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ రుసుం రూ.100గా నిర్ధారించినట్టు చెప్పారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్సు వర్తిస్తుందన్నారు. కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అధినేత, సీఎం చంద్రబాబునాయుడు ఇన్సూరెన్సు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు బాధ్యతగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని దొరబాబు కోరారు.

సీపీఎం మహాసభలకు తరలిరండి: సురేంద్ర

పెదబయలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మహాసభలకు పార్టీ శ్రేణులు తరలిరావాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకే విధంగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధరల నియంత్రణకు మార్గాలు చూపకుండా జమిలి ఎన్నికలపై ప్రస్తావన తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 8 నుంచి 15వ తేదీ వరకు ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపట్టేందుకు ప్రణాళిక రచించామన్నారు. ఇందుకోసం ఈ నెల 29న పెదబయలులో జరిగే మహాసభకు తరలిరావాలని కోరారు. నాయకులు బి.చిన్నయ్యపడాల్, సన్నిబాబు, గంగాధరం, సర్వన్న, బుజ్జిబాబు, ధర్మన్నపడాల్ పాల్గొన్నారు.

29, 30న జిల్లా స్థాయిలో సివిల్ సర్వీస్ ఉద్యోగ క్రీడాకారుల ఎంపికలు

పాడేరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు (స్త్రీ, పురుషులు) క్రీడాంశాల్లో ఈ నెల 29, 30వ తేదీల్లో జిల్లా స్థాయి ఎంపికలను నిర్వహించనున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 29వ తేదీన అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, వాలీబాల్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఖో-ఖో ఎంపికలను, 30వ తేదీన బాస్కెట్ బాల్, క్రికెట్, కబడ్డీ, హాకీ, యోగా, ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక, 30న అనకాపల్లిలో స్విమ్మింగ్ ఎంపికలను చేపడతామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని నవంబరు 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన వారిని జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు రాష్ట్ర తరుపున హాజరవుతారన్నారు. ఆసక్తిగల సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు 29వ తేదీ ఉదయం 9 గంటలకు తలారిసింగి పాఠశాల వద్దకు డిపార్టుమెంట్ ఐడా ప్రైప్, ఆధార్ కార్డు జెరాక్సుతో హాజరు కావాలని ఆయన సూచించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు కేజీబీవీ విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థిని తులసి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జి.నాగలక్ష్మి తెలిపారు. గురువారం రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ పాఠశాల పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గొల్లోరి తులసి ఈ నెల 19వ తేదీన అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభకనబర్చిందన్నారు. ఈ మేరకు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక చేశారన్నారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి పోలీలకు ఎంపికకావడంతో విద్యార్థిని, పీఈటీ వి.ఝాన్సీరాణి అభినందిస్తున్నాని ప్రిన్సిపాల్ తెలిపారు.

రాష్ట్ర ఖోఖో పోటీలకు సీతగుంట విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థి శివాజీ

పెదబయలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర-2 ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యనభ్యసిస్తున్న వంతాల శివాజీ రాష్ట్ర స్థాయిలో ఖోఖో పోటీలకు ఎంపిక య్యారని ప్రధానోపాధ్యాయులు శెట్టి మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 22న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14 విభాగంలో ఖోఖో క్రీడలో శివాజీ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారన్నారు. క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన కోరారు. ఈ మేరకు శివాజీని, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కోటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అనంతరావు, వార్డెన్ జగన్రాయ్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పరిసరి: ఎంపీడీవో

అనంతగిరి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ ఆదేశించారు. మండలంలోని కొండిబ సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన ప లు సూచనలు చేశారు. సిబ్బంది క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు తప్పరిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. ఈ-సర్వీస్ సేవలు పదికి తగ్గకుండా రిజిస్ట్రేషన్ చేయాలని, గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితిలపై అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రజలకు సేవలను అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

గొడవలకు దూరంగా ఉండండి: ఎస్ఐ



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతగిరి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ డీ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని జీనబాడు, కివర్ల పంచాయతీలో జాలడ తదితర గ్రామాల్లో గురువారం పర్యటించి వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతియుత వాతవరణం నెలకొల్పాలని, చెప్పారు. అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. గంజాయి పంట సాగు, రవాణా ద్వారా జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో తాగునీటి బోరు

ముంచంగిపుట్టు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇంజనీరింగ్ కార్యాలయం సమీపంలో జడ్పీ నిధులు రూ.1.4 లక్షలతో తాగునీటి బోరు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. కాలనీ వాసులు తాగునీటి సమస్య ఉందని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆమె బోరింగు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. దీంతో నూతన బోరింగు పనులను మొదలు పెట్టడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జగబంధు, నాయకులు తిరుపతి, సన్యాసిరావు, తిరుపతి రావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జాకరగుడలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

డుంబ్రిగుడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొర్రాయి పంచాయతీ పరిధిలోని జాకరగుడ గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి దుండగులు చోరీ చేసినట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ అధికారులకు, ఎస్ఐకు సమాచారం అందించినట్టు తెలిపారు. ఇక్కడే కాకుండా మూడు వారాల క్రితం గత్తరజిల్లాడ గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ కూడా చోరీ జరిగినట్టు చెప్పారు. ఈ ఘటనలపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గిరిజన కాఫీ రైతులకు గరిష్ఠ ధరలు

గత ఏడాది కంటే రూ.5 పెంపు: జీసీసీ డీఎం దేవరాజు

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన కాఫీ రైతులకు గరిష్ఠ ధరలు అందిస్తున్న జీసీసీ డివిజినల్ మేనేజర్‌పి. దేవరాజు అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు దళారీల వల్ల ఆదివాసీ రైతులు గరిష్ఠ ధరలు పొందలేకపోతున్నారన్నారు. గత ఏడాది కంటే రూ.5 ధరను పెంచడం జరిగిందన్నారు. ఈ ఏడాది పార్చిమెంట్ కిలో ధర రూ.285, చెర్రీ రూ.150, రొబస్టా రూ.80 ధరలుగా నిర్ణయించినట్టు చెప్పారు. రైతులు తొందరపడి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి గరిష్ఠ ధరలను నష్టపోరాదన్నారు. కాఫీ గింజలను జీసీసీ ఉద్యోగులు గృహాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తారన్నారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో 650 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఈ సేవలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ఏబీఎం కళాశాలలో రక్తాన్ని దానం చేస్తున్న దాతలు

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడి ఏబీఎం కళాశాలలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎం, రిషి, శ్రీసాయి, ఎంఎల్ఏఎస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 70 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. దాతలను లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్లు డాక్టర్ అధికారి గోపాలరావు, దస్త్రాల రాఘవేంద్రరావు అభినందించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటైన ఈ శిబిరాన్ని తొలుత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మారుతీకృష్ణ రక్తదానం చేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ మహేశ్, ఏబీఎం, రిషి విద్యా సంస్థల కరస్పాండెంట్లు అకంరెడ్డి గిరిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'నేటి నుంచి గ్రామాల్లో పశు గణన'

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాలలో శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు పశు గణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పశు సంవర్థక శాఖ ఏడీడబ్ల్యూ రాంబాబు తెలిపారు. ఇందు కోసం నర్సీపట్నం మండలం నుంచి ఎనిమిది మంది, గొలుగొండ మండలం నుంచి తొమ్మిది మంది సిబ్బందిని విషయ సేకరణ అధికారులుగా నియమించినట్టు చెప్పారు. డాక్టర్ పుష్ప, డాక్టర్ రమేశ్, డాక్టర్ శిరీషా సూపర్ వైజర్లుగా వ్యవహరిస్తారన్నారు. పశు గణన అన్ని రకాల పథకాలు రూపకల్పనకు, టీకాలు, మందులు తయారీకి ఉపయోగ పడుతుందని వివరించారు. పశు గణన కోసం విషయ సేకరణ అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు పశువులు, మేకలు, గొర్రెలు వివరాలు తెలియజేయాలని సహకరించాల్సిందిగా ఆయన ప్రజలను కోరారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

మాకవరపాలెం, అక్టోబరు 24 : గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన నర్సీపట్నం ప్రెస్ క్లబ్ సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టులు రాసే కథనాలు ప్రజల్లో ఎంతో చైతన్యం నింపుతాయన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు, ఆరోగ్య విషయంలో తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆర్డీవో వీవీ రమణ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎస్ఐ దామోదర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జర్నలిస్టుల రాష్ట్ర ప్రతినిధులు బీఎల్ స్వామి, మద్దాల రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కిశోర్ తదితరులతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

వసతి గృహాలు తనిఖీ

- క్షుణ్ణంగా పరిశీలించిన నర్సీపట్నం సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్
- వసతులు, విద్యాబోధన, భోజనం మెనూ తదితరాలపై ఆరా
- విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు



పెదబొడ్డేపల్లి ఎస్సీ వసతి గృహంలో సౌకర్యాలను తెలుసుకుంటున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం రూరల్/గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ పెదబొడ్డేపల్లిలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వంటశాల పరిసరాలు, భోజనం తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. బీసీ వసతి గృహంలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో వార్డెన్‌కు సూచనలు చేశారు. హాస్టల్‌లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని సూచించారు. అలాగే, గొలుగొండ మండలంలో గల బీసీ, ఎస్సీ వసతి గృహాలను గురువారం రాత్రి జడ్జి షియాజ్‌ఖాన్ తనిఖీ చేశారు. తొలుత గొలుగొండలో గల బీసీ వసతి హానికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం రుచికరంగా వడ్డిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. అనంతరం జోగంపేటలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందించాలని వార్డెన్లకు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, వార్డెన్లు మడ్డు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్త ఎల్లవరం విద్యార్థినులు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త ఎల్లవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో హ్యాండ్‌బాల్ పోటీ లకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి గురువారం తెలి పారు. ఇటీవల విశాఖపట్నంలోని శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు బంగారి, జానకి, అనుశ్రీ, రజిత, భవానీ, సత్యవేణి హాజరై అద్భుత ప్రతిభ చూపారన్నారు. దీంతో ఈనెల 26 తేదీ నుంచి 28వ తేదీ వరకు తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సర్పంచ్ కొల్లి రాంబాబు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాజులునాయుడు అభినందించారు.

పుత్తడిగైరంపేటలో ఉపాధి హామీ వీఆర్‌పీపై విచారణ

- అవకతవకలకు పాల్పడినట్టు గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు
- చేపట్టిన పనులు పరిశీలించి, సచివాలయంలో ఎంపీడీవో, ఏపీవో వివరాల సేకరణ



అవకతవకల ఆరోపణలపై విచారణ చేపడుతున్న అధికారులు

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుత్తడిగైరంపేటలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనుల్లో వీఆర్‌పీ అవకతవకలకు పాల్పడ్డారని అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఎంపీడీవో మేరీరోజీ, ఉపాధి హామీ ఏపీవో కె.సూర్యమణి, ఈసీ రాధిక విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆర్‌పీ నాయుడుతో పాటు పలువురు స్పందనలో జిల్లాకలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వీఆర్‌పీ వివిధ పనులకు కనీస ఎస్టిమేట్ లేకుండా గత నాలుగేళ్లుగా చేపడుతున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో ఆయా పనులను సదరు అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ప్రజల సమక్షంలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నామని ఎంపీ డీవో తెలిపారు.

అటవీ శాఖ మొక్కుబడి దాడులు

- వేములపూడి సామిల్లులో నాలుగు అడుగుల టేకు కలప మాత్రమే స్వాధీనం

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా.. వేములపూడిలోని ఒక సా మిల్లులో దాడులు నిర్వహించిన అటవీ సిబ్బంది నాలుగు ఘనపుటడుగుల టేకు కలపను మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. అన్నవరం, వేములపూడి సా మిల్లుల యజమానుల మధ్య కొద్ది నెలలుగా ఆధిపత్య పోరు సాగుతున్నది. పరస్పరం కేసులు పెట్టుకునే వరకు దారి తీసింది. నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏ జాతి కలపైనా కోటవురట్ల మండలం అన్నవరంలోని నాయుడు సా మిల్లుకి తరలించి కోయించడానికి అటవీ అధికారులు సహకరిస్తున్నారని, మిగిలిన సా మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. అక్రమ కలపను నాయుడు సా మిల్లులో కోయిస్తున్నారని, అధికారులు తనిఖీలకు వచ్చే సమయానికి కలపను మిల్లు బయట పడేస్తున్నారని అటవీ శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మరక్షక్ సిబ్బందితో కలిసి అన్నవరం సా మిల్లులో తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి అక్రమ కలప దొరకలేదని ప్రకటించారు. ఈ ప్రాంతంలో చెట్లు నరికి అక్రమంగా తరలిస్తున్నారని ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

వేములపూడి సా మిల్లుపై దాడులు

నర్సీపట్నం రేంజ్ పరిధిలో పని చేస్తున్న ఎఫ్ఎస్‌వో, బీట్ ఆఫీసరు, ఏబీవోకి వేములపూడి సామిల్లులో అక్రమ కలప ఉందని ముందస్తు సమాచారం వచ్చింది. సదరు అటవీ సిబ్బంది విజిలెన్స్ డీఎఫ్‌వో దృష్టిలో పెట్టి గురువారం వేములపూడి సా మిల్లులో తనిఖీలు చేశారు. కోతకోస్తున్న నాలుగు అడుగుల టేకు కలప స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని నుంచి లిఖితపూర్వంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ కలపకు గతంలో స్క్వాడ్ డీఎఫ్‌వో కేసు రాశారని కలప యజమాని సుకల సత్యనారాయణ రశీదుని అటవీ అధికారులకు చూపించారు. దీనిపై ఎఫ్ఎస్‌వో అప్పారావుని వివరణ కోరగా.. ఇంకా కేసు రాయలేదన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులనాయుడు

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- ఆత్మీయ సమావేశంలో పీఆర్‌టీయూ, మిత్ర సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్‌టీయూ, మిత్ర సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. 2018 నవంబరు ఒకటి నుంచి 2024 నవంబరు ఒకటి మధ్య ఆరు సంవత్సరాల కాలంలో మూడు సంవత్సరాలు హైస్కూల్‌లో పనిచేసిన ఉపాధ్యాయులను అర్హులుగా గుర్తిస్తారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనుమతించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రస్తుతం ఉన్న జీవో ప్రకారం శిశు సంరక్షణ సెలవులు 180 రోజులు మంజూరు చేస్తున్నారని, ఆ సెలవులు బిడ్డకు 18 సంవత్సరాలు వచ్చే వరకు వాడుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. రిటైర్మెంట్ అయ్యే వరకు సెలవులు ఉపయోగించుకునే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్, ఎంఎస్ ప్రసాద్ అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సుందరకోట పంచాయతీలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటుకు వినతి

నాతవరం, అక్టోబరు 24 : మండలంలోని సుందరకోట పంచాయతీ సిరిపురం, త్సొరడ అసనగిరి, ముంతమామిడి తదితర ఎనిమిది కొండమీద మీద గిరిజన గ్రామాలకు సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని గిరి మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి బండి గంగరాజు కోరారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ గ్రామాలకు ఇనుప స్తంభాలు వేసి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారన్నారు. ఈ కారణంగా వర్షాలు కురిసేటప్పుడు మూగజీవులు ఏ మాత్రం ఇనుప స్తంభాలను తాకినా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయని వాపోయారు. ప్రస్తుతం కొండ మీద గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా ఉందని అధికారులు సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎస్పీ తుహిన్‌సిన్హాను కలిసిన తాతయ్యబాబు



ఎస్పీని సత్కరిస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాను రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో భూ సమస్యల శాశ్వత పరిష్కారమే రెవెన్యూ సభల లక్ష్యమని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. గురువారం కేపీ.అగ్రహారంలో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రీ సర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఈ సభలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు. ఈ సభలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామూర్తి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చోడవరం నియోజకవర్గం అధోగతి పాలైందని, కూటమి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. పి.భీమవరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నిర్లక్ష్య పాలనతో రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వంతెనలు కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, రిజర్వాయర్ల ఆధునికీకరణ పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి దూది రాజేష్, మండల అధ్యక్షుడు సీతా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనేతరుల సాగు భూములు ఆన్‌లైన్ చేయాలి'



సమావేశంలో పాల్గొన్న వేణుగోపాల్

కృష్ణాదేవిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో ఉన్న గిరిజనేతరుల సాగు భూములను ఆన్‌లైన్ చేయాలని గొలుగొండ మాజీ జడ్పీటీసీ టికెల తారకవేణు గోపాల్ అధికారులు కోరారు. ఇక్కడి అల్లూరిపార్కులో టీడీపీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొలుగొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందిన గిరిజనేతరులు బ్రిటీష్ కాలం నుంచి 1/70 యాక్టుకు ముందు కొయ్యూరు మండలంలో భూములు సాగు చేస్తున్నారన్నారు. వీరి భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని ఆధా రాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందలేక పోతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో సాగు భూములను ఆన్‌లైన్ చేయమంటున్నామే తప్ప, గిరిజనుల హక్కులకు భంగం కలిగించాలనే ఉద్దేశ్యం తమకు లేదని వివరించారు. గతంలో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గిరిజన ప్రాంతంలో ఉన్న గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని జీవో కూడా జారీ చేశారన్నారు. అదే విధంగా పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్ హయంలో గ్రామ సభ తీర్మానం చేసి ఎటువంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశారన్నారు. ఇందులో భాగంగానే కొయ్యూరు మండలం ఆడాకుల ప్రాంతంలో ఉన్న గిరిజనేతరులు 149 మంది భూము లను ఆన్‌లైన్ చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీ డీపీవోకు నెల క్రితం ఆర్డర్ జారీ చేస్తే కావాలనే వాటిని కొంతమంది తప్పుగా సోషల్ మీడియాలో వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మార్పుపై కలెక్టర్‌కు నివేదిక

- నర్సీపట్నం ఆర్డీవో రమణ



వివరాలు సేకరిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో రమణ

మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మార్పుపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఓ భవనంలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తుండడం, ఆ భవనాన్ని తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతుండడం, మరోవైపు భవనాన్ని తమకు ఇస్తే డిగ్రీ విద్యార్థుల తరగతుల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని అధ్యాపకులు విన్నవిస్తుండడంతో సమగ్ర విచారణ చేపట్టి తమకు నివేదిక అందించాలని నర్సీపట్నం ఆర్డీవో రమణకు కలెక్టర్‌కు ఆదేశించారు. ఈ మేరకు గురువారం మాడుగుల వచ్చిన ఆర్డీవో మండల విద్యా శాఖ అధికారులు, తహసీల్దార్ రమాదేవితో భవనాలను పరిశీలించారు. అనంతరం డీఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలతో కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆర్డీవోకు తెలిపారు.

కలిగొట్ల అప్రోచ్ రోడ్డు స్థల పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో అయిషా

దేవరాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగొట్ల సమీపంలో శారదానదిపై వేసిన బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు అవసరమైన స్థలాన్ని అనకాపల్లి ఆర్డీవో ఎస్.అయిషా గురువారం పరిశీలించారు. ఐదేళ్లకు పైగా బ్రిడ్జి పూర్తి చేసినప్పటికీ వేచలం వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో రాక పోకల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పరిశీలించారు. ఇరు వైపులా అప్రోచ్ రోడ్డు వేసేందుకు అవసరమైన రెండు ఎకరాల 30 సెంట్ల భూమిని కలిగొట్లకు చెందిన రైతులతో భూసేకరణపై చర్చించారు. మార్కెట్ రేటు ప్రకారం రైతులకు పరిహారం ఇస్తామని ఆర్డీవో చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలో నాలుగు చిన్నతరహా, ఐదు పెద్దతరహా నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవీకి సూచించారు.

ఇనాం సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలి

- రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు

కె.కోటపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌడువాడ గ్రామంలో మూడు తరాలుగా ఇనాం భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ భాగ్యవతికి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడువాడ ఇనాం భూములపై గతంలో ప్రభుత్వం, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. ఆయన వెంట సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కుమార వెంకటరమణ, సంఘం సభ్యులు కుమార విశ్వనాథం, సన్యాసినాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థులు

దేవరాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి.రఘు గురువారం తెలిపారు. అనకాపల్లిలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా బాలుర, బాలికల టెన్నీకాయిట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన పి.సాయికుమార్, ఎస్.మణికుమార్ అండర్-14, అండర్-17 విభాగంలో ఎంపికైనట్టు చెప్పారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావులను ఆయన అభినందించారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించండి

- బీసీ హాస్టల్‌ను సందర్శించిన న్యాయమూర్తి

రోలుగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో విద్యార్థులకు తగిన సదుపాయాలు కల్పించాలని, నాణ్యమైన విద్యనందించాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ సూచించారు. రోలుగుంట బీసీ హాస్టల్‌ను గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, వసతుల గురించి ఆరా తీశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గదులు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్ భవనం మరమ్మతులకు గురైందని, దీనిపై నివేదిక అందిస్తామని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలతో వసతి గృహాలను తనిఖీ చేస్తున్నామని, అక్కడ ఉన్న సదుపాయాలను, అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి హైకోర్టుకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ హరిగోపాల్, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గోవాడలో లోవోల్టేజి సమస్య పరిష్కారం

- ఈపీడీసీఎల్ ఏఈ ఉదయకుమార్

చోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించామని ఈపీడీసీఎల్ రూరల్ ఏఈ టి.ఉదయకుమార్ తెలిపారు. గోవాడలో విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి సమస్యపై స్థానికంగా వినియోగదారులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సమస్య పరిష్కరించినట్టు ఏఈ వివరించారు.

ఉప్పులో అయోడిన్‌తో ఆరోగ్యానికి మేలు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప్పులో ఉండే అయోడిన్ ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుందని గ్రామ సర్పంచ్ కంతే పద్మరేఖ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అయోడిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల మానసిక, శారీరక వైకల్యం వస్తుందని చెప్పారు. ఈ ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది రాధ, బాల, మహాలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవాలయాల ట్రస్టు బోర్డులో బ్రాహ్మణులకు అవకాశం హర్షణీయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

చోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాలయాల్లోని ట్రస్టు బోర్డు నియామకాల్లో ఇద్దరు బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు యు.శ్రీనివాస్ చెప్పారు. ఆలయాల ట్రస్టు బోర్డులో ఇద్దరు బ్రాహ్మణులను నియమించడం వల్ల బ్రాహ్మణ సామాజిక వర్గానికి గుర్తింపు ఇచ్చినట్టయిందన్నారు. హిందూ ఆగమశాస్త్రాలపై అవగాహన కలిగిన బ్రాహ్మణులకు ట్రస్టు బోర్డులో అవకాశం కల్పించడం వల్ల ఆలయాల నిర్వహణ మరింత మెరుగుపడుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

వార్డు సభ్యుల సహకారంతోనే గ్రామాభివృద్ధి

చీడికాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వార్డు సభ్యుల సహకారంతోనే గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుందని కోనాం సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ అన్నారు. కోనాం సచివాలయంలో గురువారం జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.74 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సిరికి సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ కంటిముఖి సత్యవతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ స్టడీ సర్కిల్‌లో 150 మంది ఎస్సీ యువతులకు అవకాశం

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ


ఏపీ స్టడీ సర్కిల్ భవనం

ఏ జిల్లాకు చెందిన వారైనా దరఖాస్తు చేసుకునే వీలు

ప్రైవేటు శిక్షణ సంస్థల్లో మరో వందమందికి శిక్షణ

- పురుష అభ్యర్థులూ అర్హులే
- శిక్షణ ఇచ్చే సంస్థలకు ఫీజులు చెల్లించనున్న ప్రభుత్వం
- ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4,500 స్టైపెండ్
- రూ.3 వేలు విలువచేసే మెటీరియల్ అందజేత
- బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలోనూ ఏర్పాట్లు
- శిక్షణ కాలంలో రూ.1,500 చొప్పున స్టైపెండ్
- నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే టెట్ నిర్వహించగా, వచ్చే నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 16 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఆయా కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీలో ఉచిత శిక్షణతో పాటు అభ్యర్థులకు స్టైపెండ్ అందించనున్నారు. ఈ మేరకు జిల్లాలోని సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏపీ స్టడీ సర్కిల్‌లో 150 మంది ఎస్సీ యువతులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 25వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. ఉచితంగా మెటీరియల్ అందించనున్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. అర్హులైన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం https://mdfc.apcfss.in, http//jnanabhumi.ap.gov.in అనే పోర్టల్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మాత్రమే ఏపీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ పురుష అభ్యర్థులతోపాటు మహిళలకూ ప్రైవేటు శిక్షణ సంస్థల్లో ఉచితంగా శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం ఇదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. విభజిత విశాఖ జిల్లాకు చెందిన 150 మందికి ప్రైవేటు శిక్షణ సంస్థల్లో ఉచితంగా శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు రూ.12 వేలు, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులకు రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం ఆయా శిక్షణ సంస్థలకు ఫీజు చెల్లించనుంది. ఎంపికైన అభ్యర్థులకు రూ.3 వేలు విలువజేసే మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.4,500 చొప్పున స్టైపెండ్ ఇస్తారు. శిక్షణ కాలం మూడు నెలలు.

బీసీ స్టడీ సర్కిల్‌లో...

బీసీ అభ్యర్థులకు కూడా ఉచిత శిక్షణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 200 మంది బీసీ అభ్యర్థులకు ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకు 250 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారు. శిక్షణ కాలంలో రూ.3 వేలు విలువజేసే మెటీరియల్‌తోపాటు రూ.1,500 చొప్పున స్టైపెండ్ ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



డీఎస్సీ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మెరుగైన శిక్షణ అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించింది. ఏపీ స్టడీ సర్కిల్‌తోపాటు ప్రైవేటు శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టింది. ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.25 వేలు వెచ్చించనుంది. పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు శిక్షణ సంస్థలను ఎంపిక చేశాం. గత డీఎస్సీలో 100 ఉద్యోగాలు సాధించిన, మూడేళ్ల సరాసరి టర్నోవర్ రూ.40 లక్షలున్న, రెండు డీఎస్సీలకు శిక్షణ ఇచ్చిన అనుభవం కలిగిన సంస్థలను ఎంపిక చేశాం. దరఖాస్తుదారులకు వచ్చే నెల మొదటి వారంలో రాత పరీక్ష నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తాం.

- కె.రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు


జిప్‌లైన్‌లో ప్రయాణిస్తున్న పర్యాటకుడు

తాజంగి వెళ్దాం.. ఎంజాయ్ చేద్దాం

- ప్రకృతి అందాలతో పాటు సాహస క్రీడల సమాహారం
- పర్యాటక సీజన్‌లో సందడే సందడి

ప్రకృతి అందాలను ఆస్వాదించడంతోపాటు సాహస క్రీడల్లో పాల్గొనాలంటే ఆంధ్ర కశ్మీర్ లంబసింగి సమీపంలోని తాజంగి జలాశయానికి వెళ్లాల్సిందే. లంబసింగి మంచు అందాలను తిలకించేందుకు శీతాకాలంలో భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు. ఇక్కడి అందాలను తిలకించిన తరువాత తాజంగి జలాశయం వద్దకు వెళుతుంటారు. ఇక్కడ జిప్‌లైన్, ఆర్చరీ, బంగీ జంప్, బోటు షికార్ అందుబాటులో ఉన్నాయి. జిప్‌లైన్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటుంది. కొండ పైనుంచి జలాశయం మీదుగా వెళ్లడం మంచి అనుభూతిని ఇస్తుందని పర్యాటకులు చెబుతుంటారు. అలాగే ఆర్చరీ, బంగీ జంప్‌లను ఎంజాయ్ చేస్తున్నారు. జలాశయం వద్ద రెండు పెడలింగ్ బోట్లు, ఒక సైక్లింగ్, కయాక్ బోట్లు అందుబాటులో ఉన్నాయి. సందర్శకులు సాహస క్రీడలతో పాటు బోటింగ్ చేసే అవకాశం ఉంది.


బోటు షికార్ చేస్తున్న పర్యాటకులు

గిరిజన నృత్యం థింసా ప్రదర్శన

ఉదయం వేళ పర్యాటక వికాస్ యువత తాజంగి మహిళలతో గిరిజన సంప్రదాయ నృత్యమైన థింసాను ప్రదర్శిస్తున్నారు. జలాశయానికి వచ్చిన పర్యాటకులు థింసాను తిలకించి ఎంజాయ్ చేస్తున్నారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల ప్రజలు ఆదివాసీలతో కలిసి థింసా నృత్యానికి స్టెప్పులు వేస్తుంటారు. కాగా జలాశయం వద్ద అదనపు సాహస క్రీడలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా బంజీ ట్రాంపోలిన్, స్కై సైక్లింగ్, బర్మాబ్రిడ్జి, టైర్‌వాల్ సాహస క్రీడలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

జలాశయానికి ఎలా వెళ్లాలంటే..

లంబసింగికి ఏడు కిలోమీటర్ల దూరంలో జి.మాడుగుల- తాజంగి ప్రధాన రహదారికి ఆనుకుని ఈ జలాశయం ఉంది. జలాశయానికి వెళ్లేందుకు కేవలం ప్రైవేటు వాహనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వ్యక్తిగత వాహనాల ద్వారా నేరుగా జలాశయానికి చేరుకోవచ్చు.

సాహస క్రీడలు, బోటింగ్ ధరలు

తాజంగి జలాశయం వద్ద ఏర్పాటుచేసిన సాహస క్రీడల ధరలను కూడా ఐటీడీఏ నిర్ణయించింది. జిప్‌లైన్‌లో ప్రయాణానికి ఒక్కొక్కరికి రూ.200, ఆర్చరీ రూ.50, బంగీ జంప్ రూ.30, బోట్ షికారు ఒకరికి రూ.100గా నిర్ణయించారు.

- చింతపల్లి

ఎన్‌డీపీఎస్ సెల్ ప్రారంభం


ఎన్‌డీపీఎస్ సెల్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టేందుకు, దాడులు జరిపేందుకు ఎన్‌డీపీఎస్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం పోలీస్ కార్యాలయంలో ఎన్‌డీపీఎస్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా జరిగే వివిధ మార్గాలు, దారులు, అనుమానాస్పద గ్రామాలు, ప్రదేశాలు, వ్యక్తులపై నిఘా పెట్టేందుకు ఈ సెల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ సెల్‌లో కొంతమంది అధికారులను నియమించామని, వారంతా గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రణాళికలు రచిస్తారన్నారు. స్టాటిక్, డైనమిక్ చెక్‌పోస్టులను బలోపేతం చేయడం, తప్పించుకుని తిరుగుతున్న గంజాయి కేసుల నిందితులను అరెస్టు చేసేందుకు ఈ సెల్‌లో నియమించిన అధికారులు కీలకంగా వ్యవహరిస్తారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు

- వినియోగదారులకు మెరుగైన సేవలు, నిరంతర విద్యుత్ అందించినందుకు గుర్తింపు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు జాతీయ అవార్డు లభించింది. ఇంధన రంగంలో విశేష సేవలు అందించిన సంస్థలను ఢిల్లీలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ నెల 22, 23 తేదీల్లో '12వ ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డ్స్'తో సత్కరించింది. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు, నిరంతర విద్యుత్ అందించడంతో పాటు నూతన ఆవిష్కరణలతో ముందుకు వెళుతున్న ఈపీడీసీఎల్‌కు 'ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్-లార్జ్ డిస్కమ్' అవార్డును ప్రదానం చేసింది. సీఎండీ పృథ్వీతేజ్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయడం వల్లనే ఈ అవార్డు లభించిందన్నారు.

రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరామ్మూర్తి మృతి


శ్రీరామ్మూర్తి (ఫైల్)

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రాయపురెడ్డి శ్రీరామ్మూర్తి గురువారం గుండెపోటుతో మృతిచెందారు. గొలుగొండ మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఆయన గురువారం ఉదయం ఇక్కడి నుంచి విశాఖపట్నం బయలు దేరారు. నర్సీపట్నం వెళ్లేసరికి గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతిచెందారు.

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే సర్వీసులకు అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్ ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల రైలుకు ఈనెల 25న, తిరుగు ప్రయాణంలో కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబరు గల రైలుకు ఈ నెల 26న కోచ్ అందుబాటులో ఉంటుందన్నారు.

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సంబంధించి పంట బీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. పంటల బీమాపై గురువారం కలెక్టరేట్, వ్యవసాయశాఖ అధికారులతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా ప్రీమియం కట్టుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకు, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది కౌలు రైతులు ఉండగా, రెండు లక్షల మందికి మాత్రమే బ్యాంకు రుణాలు అందాయని, మిగిలిన వారి పేర్లు కూడా బ్యాంకులకు లింకేజి చేసి రుణాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ జాహ్నవి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ జాహ్నవి, వ్యవసాయశాఖ అధికారులు

ఆడపిల్లల భద్రతే ప్రభుత్వ ధ్యేయం

- హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం రాత్రి ఆమె ఆంధ్ర వైద్య కళాశాలలోని మహిళా వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గతంలో మెడికల్ కళాశాల విద్యార్థినులు కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారంలో భాగంగా ఆస్పత్రిలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేసిన దాఖలాలు లేవని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించారని తెలిపారు. నగరంలో ఎక్కడ ఏ నేరం జరిగినా పోలీసులు 24 గంటల్లో నిందితులను పట్టుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రత బాగ్చీ, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మంత్రి కలెక్టర్, సీపీతో కలిసి బీచ్‌రోడ్డును సందర్శించి, నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు.



ఏఎంసీలోని మహిళా వసతిగృహాన్ని పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

జల్ జీవన్ మిషన్ పనుల్లో జాప్యం

... 5వ పేజీ తరువాయి

గురించి ప్రశ్నించగా, అనకాపల్లి వ్యవసాయాధికారి మోహనరావు బదులిస్తూ జిల్లాలో ఎనిమిది వేల టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. అనకాపల్లి ఎంపీపీ గొర్లె సూరిబాబు మాట్లాడుతూ, కలెక్టర్ కార్యాలయం పరిసరాల్లో పంట పొలాలు నీట మునుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేయగా.. జలవనరుల శాఖ ఈఈ త్రినాథ్ మాట్లాడుతూ, వచ్చే ఖరీఫ్ సీజన్‌కల్లా కాలువల్లో పూడిక తీయిస్తామన్నారు. ఈ దశలో కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ పొలాలు నీట మునగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, మార్కెట్ కమిటీల ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల అవసరాలకు వెచ్చించాలని అన్నారు. సభ్యులు సమావేశాలకు వచ్చే ముందు స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. తొలుత జడ్పీ సీఈవో నారాయణ మూర్తి స్వాగతం పలికారు. తొలిసారి సమావేశానికి వచ్చిన హోం మంత్రి అనితను చైర్‌పర్సన్ సుభద్ర సత్కరించారు. ఎంపీలు శ్రీభరత్, తనూజరాణిలను సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ సన్మానించారు. సమావేశానికి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల కలెక్టర్లు విజయకృష్ణన్, హరేంధిరప్రసాద్, దినేశ్‌కుమార్, పలుశాఖల అధికారులు హాజరయ్యారు.

రోడ్డెక్కిన బీసీ విద్యార్థినులు

... 5వ పేజీ తరువాయి

సత్వరం పరిష్కరించాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కొద్దిసేపటి తరువాత సీఐ ధనుంజయరావు, తహసీల్దారు వరహాలు, ఎస్‌ఐలు అక్కడకు చేరుకున్నారు. విద్యార్థినుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు భవానీ, రేణు, రవి, అభి, రాము, తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో బేజారు!

... 5వ పేజీ తరువాయి

కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్వారీ లారీలు, టిప్పర్లకు గతంలో రాత్రిపూట మాత్రమే అనకాపల్లి పట్టణంలోకి అనుమతి ఉండేది. కానీ ఇటీవల కాలంలో క్వారీలు, స్టోన్ క్రషర్ల నిర్వాహకుల ఒత్తిడితో పోలీసు, రవాణా శాఖల అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో వేళాపాళా లేకుండా నిరంతరం క్వారీ లారీలు, టిప్పర్లు పట్టణ వీధుల్లో రాకపోకలు సాగిస్తున్నాయి.

రోడ్లు మరింత ఛిద్రం

క్వారీ లారీలు, టిప్పర్లలో 25 టన్నులకు పైబడి రాయి, పిక్క, స్టోన్ క్రషర్ బుగ్గిని రవాణా చేస్తున్నారు. అసలే అధ్వానంగా వున్న రహదారులు.. మరింత దారుణంగా తయారవుతున్నాయి. అనకాపల్లి మండలం మామిడిపాలెం, మార్టూరు, మాకవరంతోపాటు మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో రోడ్లు మొత్తం ఛిత్రం అవుతున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం పది టైర్ల లారీలో 20 టన్నులు మాత్రమే రవాణా చేయాలి. కానీ క్వారీల నిర్వాహకులు అదనంగా పది నుంచి 15 టన్నులు లోడ్‌చేసి రవాణా చేస్తున్నారు. అయినాసరే రవాణా, పోలీసు శాఖల అధికారులు ఎక్కడా అడ్డుకుని కేసులు నమోదు చేసిన దాఖలాలు ఈ మధ్య కాలంలో లేవు. పోలీసు, రవాణా శాఖల జిల్లాస్థాయి అధికారులు అయినా స్పందించి, అధిక లోడుతో ప్రయాణించే క్వారీ, క్రషర్ల లారీలు, టిప్పర్లను ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు అనకాపల్లి పట్టణంలోకి అనుమతించవద్దని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైం... crime news

లారీ ఢీకొని ఒకరి మృతి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజవొమ్మంగికి చెందిన నక్క రామకృష్ణ(40) నక్కపల్లి నుంచి తుని వైపు బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. దీంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

కందిరీగల దాడిలో చిన్నారితో సహా తల్లి మృతి


డుంబ్రిగుడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్రుం పంచాయతీ జోడిగుడ గ్రామంలో కందిరీగల దాడిలో చిన్నారితో పాటు తల్లి మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జోడిగుడ గ్రామానికి చెందిన కిల్లో పూర్ణిమ ఏడాది వయసు గల తన కుమార్తె గీతాంజలిని తీసుకుని బుధవారం పోడు పనులకు బయలుదేరింది. అయితే మార్గమధ్యంలో ఆకస్మికంగా కందిరీగలు దాడి చేశాయి. ఈ సంఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా, చిన్నారి మృతి చెందింది. పూర్ణిమ పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.

పాల సేకరణ ధర తగ్గింపుపై నిరసన

పరవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను ఐదు రూపాయలు తగ్గించడాన్ని నిరసిస్తూ పరవాడ పాల సేకరణ కేంద్రం వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల సేకరణ ధరను తగ్గించడం దారుణమన్నారు. డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల సేకరణ ధరను పెంచకపోతే ఈ నెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు పోతల శంకరరావు, బొడ్డు అప్పలనాయుడు, రెడ్డి నాయుడు, సతీశ్, బండారు చిన్నోడు, పైలా పైడంనాయుడు, నాగేశ్వరరావు, పైలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసిద్ధిలో ఉద్రిక్తత

- శ్మశానవాటిక దారిలో సిమెంట్ స్తంభాలు ధ్వంసం
- మృతదేహాన్ని తరలించడానికి ఇబ్బందులు
- ధర్నాకు దిగిన మృతుడి బంధువులు


సిమెంట్ స్తంభాలను ధ్వంసం చేయడంతో మృతదేహాన్ని కాలువలో దిగి మోసుకుంటూ వెళుతున్న దృశ్యం

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని ఓ వ్యక్తి ధ్వంసం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించే క్రమంలో గురువారం ఈ సంఘటన మండలంలోని సర్వసిద్ధి దళిత కాలనీలో జరిగింది. మండలంలోని సర్వసిద్ధి దళిత కాలనీలో గురువారం చిందాడ చిన సన్యాసినాయుడు(65) అనే దళితుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని తీసుకు వెళ్లే దారిని కాలనీకి చెందిన ఓ దళితుడు ధ్వంసం చేయడంతో రోడ్డుపైనే శవపేటికను రెండు గంటలపాటు ఉంచాల్సి వచ్చింది. వాస్తవానికి శ్మశాన వాటికకు వెళ్లాలంటే పంట కాలువపై ఉన్న సిమెంట్ స్తంభాలను దాటుకుని వెళ్లాలి. అయితే ఆ సిమెంట్ స్తంభాలను స్థానికుడు ధ్వంసం చేయడంతో బాధిత కుటుంబాలు రోడ్డుపైనే ఆందోళనకు దిగాయి. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో హెడ్ కానిస్టేబుల్ సిబ్బందితో అక్కడకు వెళ్లి మృతదేహాన్ని తీసుకువెళ్లమని చెప్పడంతో పంట కాలువలో దిగి శ్మశాన వాటికకు తరలించారు. దారిని ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులకు మృతుని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.